ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

SA
43076

ఆగస్టు 23, 2009







స్వైన్‌ఫ్లూ స్వైరవిహారం

హ్యాపీ బర్త్‌డే

(2009 ఆగస్టు 23 నుంచి 2009 ఆగస్టు 29 వరకు)



ఆర్. రిషి
5సం॥, ఆగస్టు-2004
ధనలక్ష్మి-రాజగోపాల్
పార్శిగుట్ట-హైదరాబాద్

ఎం. పుష్కరిణి
6సం॥, ఆగస్టు-23
సరోజిని-పుల్లారావు
భద్రాచలం-ఖమ్మం

కె. మహా
2సం॥, ఆగస్టు-24
ఉమ-అశోక్
మందమర్రి-ఆదిలాబాద్

సుభోవిని(బబ్లూ)
2సం॥, ఆగస్టు-24
సునీత-సుబ్బరామయ్య
ఎన్.జి.ఒ.కాలనీ-కడప

ప్రజ్వల్
5సం॥, ఆగస్టు-2004
మాసమ్మ-రత్నయ్య
వనపర్తి-మ॥నగర్

ఎస్.కె. జమిల
2॥, ఆగస్టు-25
నస్రిన్-జమల్
ఖమ్మం

ఎస్.కె. అఫ్సర్
8సం॥, ఆగస్టు-26
అస్మ-అఫజల్
ఖమ్మం

బి. చందన
9సం॥, ఆగస్టు-2000
సుజాత-శ్రీనివాసులు
పాలెం-మ॥నగర్

ఎం. అక్షయ(లాస్య)
1సం॥, ఆగస్టు-2008
జ్యోతి-వెంకన్న
మోత్కూరు-నల్లగొండ

ఎ.ఆర్. జ్యోతిర్మయి
ఆగస్టు
సుధారాణి-శ్రీధర్
తార్నాక-సికింద్రాబాద్

శివభార్గవి
ఆగస్టు
లక్ష్మీకళ్యాణి-రాజశేఖర్
కమ్మబంటుపల్లి-శ్రీకాకుళం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

మనలో మాట

వినాయకుడి భూలోక యాత్ర

(చవితికి భూలోకం వెళ్లొచ్చిన వినాయకుడిని కైలాస ద్వారపాలకులు అడ్డుకుంటారు)

"నేనేనయ్యా గణేశుడ్ని! లోపలికి వెళ్లనివ్వండి"

"ఛ! నువ్వు మా విఘ్నేశ్వరుడివా? నువ్వూ నీ అవతారమూను! వెళ్లెళ్లు..."

"అహో! నేను వినాయకుడినేనని ఎలా నమ్మించాలి? ఇదిగో ఈ వక్రతొండం చూశాక కూడా అనుమానమా?"

"మా శాంభవి బొద్దుగా ముద్దుగా ఇంత బొజ్జతో వుంటాడు. మరి నీకు ఆ కుండలాంటి బొజ్జేదీ! నీలాంటి అనామకులకు కైలాస ప్రవేశమా! సమస్యే లేదు. ఫో...ఫో..."

"హో...మాతా! నీ ముద్దుబిడ్డడి రాకను ద్వారపాలకులు అడ్డుకుంటున్నా కాపాడలేవా!".

(అప్పడే అటుగా వచ్చిన పార్వతీదేవి ఆ మాటలు విని కంగారుగా వచ్చి...)

"ఎక్కడ నా ఏకదంతుడి మాటలు వినిపించాయి? వాడ్ని చూసి పక్షం రోజులైంది"

"మాతా వచ్చితివా? భూలోక యాత్ర చేసొచ్చిన నీ బుజ్జి గణపతిని దీవించమ్మా"

"హో...నువ్వు మా బొజ్జగణపయ్యవా? అసాధ్యం. కదుములు, ఉండ్రాళ్లతో నిండుకుండలా వుండే నీ బొజ్జేదీ అసలు. పైగా ఆ పిలకేంటీ... ఈ అవతారమేంటీ? భూలోకవాసులు మా బుజ్జి గణపయ్యకు తిండిపెట్టకుండా మాడ్చేంత పిసినారులయ్యారా?"

"లేదమ్మా! అచట ధరలు భగ్గుమని మండిపోతున్నాయి. కేజీ బియ్యం నలభై, కందిపప్పు వంద, డజను అరటిపళ్లు నలభై రూపాయలు. ఏదీ కొనేట్టు లేదమ్మా. చెప్పకుంటే సిగ్గుచేటు. పూజకు పత్రి కూడా లేదమ్మా..."

"సిద్ధి వినాయకుడి పూజకూ అంత వెనుకాడుచున్నారా? అల్ప మానవులు"

"పొరపడ్డారు మాతా? అచట కరువు మూలంగా గ్రాసం లేక పశువులను కూడా కబేళాలాలకు తోలుతున్నారు"

"అక్కటా ఎంత కష్టమొచ్చింది? నీ బుజ్జి బొజ్జ ఏమైంది కన్నా"

"భక్తులు ఉండ్రాళ్లు, కుడుములు, పత్రి లేకుండానే పూజా కార్యక్రమాన్ని మమా అనిపించేశారు. తిండి లేక నకనకలాడుతుండగా అచటి వ్యాయామశాలలు కనిపించాయి మాతా. వాటికి అక్కడ మిక్కిలి మోజు వున్నది. అందులో చేరి పొట్ట కరిగించి ఇదిగో ఆరు పొట్లాల శరీరాన్ని సంపాదించాను మాతా"

"సర్సరి! ఎన్నడూ లేనిది ఆ పిలక ఏమిటి నాయనా?"

"ఇలా కురులు పెంచుకుని తాడుతో బిగించి కట్టుకోవడం భూలోకంలో ఫ్యాషన్ మాతా. అందుకనీ..."

"మరి...ముక్కుకు ఆ గుడ్డ ఎందులకు కట్టుకుంటివి పుత్రా గజాననా"

"అదో పెద్ద విషాదగాధ మాతా! అచట స్వైన్ ఫ్లూ అనే జబ్బుతో జనులు భయభ్రాంతులై రక్షణకవచంలా గుడ్డముక్కను కట్టుకుంటున్నారు తల్లీ"

"శివ శివా? తెనుగు గడ్డమీద ఓ వైపు విచిత్ర పోకడలు...మరోవైపు కరువు. అన్ని కష్టాలతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అవుతున్నా...కరవు గురించి పట్టించుకోని రాజూ ఒక రాజేనా!..."

తల్లి తల్లడిల్లింది.

దివ్యదృష్టితో అదంతా విన్న కైలాసనాథుడు విస్తుపోయాడు.

✱

ఈ సంచికలో....

టపా	...	2
నవ్వుల్ పువ్వుల్	...	3
రుచి	...	7
సీరియల్	...	8
చూద్దామా	...	10
ఆరోగ్యం	...	11
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
రుచి	...	17
కవిత్వమ్	...	18
క్రైమ్ కథ	...	19
సమ్‌థింగ్ స్పెషల్	...	20
తెల్సా	...	21
కొత్తపుస్తకాలు	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

చారిత్రక వెలుగు



బేబీ భీమ ... 6

కథ ... 22

గతం గురుతులు



యోగా విశిష్టత తెలిసెనులే

ఆగస్టు 9 స్నేహలో సాహిల్ అందించిన 'అట్టమీది కథ' జాతీయ గీతిక అర్థ వివరణ బావుంది. యోగా బామ్మ విశేషాలనుబట్టి యోగా విశిష్టత తెలుస్తోంది. టమాటా కబుర్ల ద్వారా టమాటా పోషక విలువల సరళిని మాముందుంచారు. 'కవిత్వమ్'లోని కవితలు భావగర్భితంగా వున్నాయి. స్ఫూర్తి ద్వారా వకుళాభరణం రామకృష్ణ గారు ఉదహరించిన చారిత్రక చేదునిజమైన సావర్కర్ హిందూమత భావాలకు లోనై, మత వైషమ్యాలకు దోహదం చేయడం మమ్మల్ని నివ్వెరపరిచింది. హరి వెంకటరమణ చిన్నకథ 'పులొచ్చింది' మాకు నచ్చింది. 'గని' సీరియల్ ఆసక్తికరంగా సాగుతోంది. బాలనేస్తాలు 'చేసేద్దాం' లో ఫొటోఫ్రేం తయారీ చాలా బాగుంది. 'తెల్సా' వార్తల్లో వార్తల వుత్తరాలు, పింక్ జైలు లాంటివి శ్రద్ధగా చదివేలా ఉన్నాయ్. 'మనలోమాట'గా అన్నం పెట్టే రైతన్న కనిపించే దేవుడు. అన్నదాతా సుఖీభవ అనిపించేలా వుంటాడు. అలాగే ఆగస్టు మొదటి వారం లో డా॥విజయ్ స్నేహమాధుర్యం చవిచూపే విధంగా అట్టమీది కథను అందించారు. అనురాగాల నిండుపౌర్ణమి అంటూ అమరనారాయణ రచన ద్వారా రాఖీ వైశిష్ట్యం తెలిసింది. స్నేహమంటే.... చిత్రావళి బాగుంది. స్నేహ సౌందర్యాన్ని ఆస్వాదించాం. తాంబూలం విశిష్టతను తెలియజేసిన యాజీవ్‌కు అభినందనలు. 'గని' సీరియల్ ఆసక్తికరంగా కొనసాగుతోంది. 'బాలనేస్తాలు'లో చిత్రవిచిత్రం అంశం అంటే మాకెంతో ఇష్టం. తెల్సా ద్వారా సర్కస్ ఎలా పుట్టిందో మాకవగతమైంది. బిడ్డకు తల్లిపాలే శ్రేష్టం అన్న విషయాన్ని 'ఆరోగ్యం' ద్వారా చెప్పడం బాగుంది. 'స్ఫూర్తి' శీర్షిక ప్రేరణ కలిగిస్తూ కొత్త పుస్తక పరిచయ భాగ్యం కలిగిస్తోంది. అమ్మానాన్నలను ఆదరించలేని బతుకూ ఓ బతుకేనా అనిపిస్తోంది మనలోమాట చదువుతుంటే.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

మాట బాగుంది

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్నేహ జాతీయ జెండాతో ముస్తాబవడం బాగుంది. కంపెనీ రాబందులు, సహకార కామందులను రైతులే తరమాలనడం బాగుంది. టమాటా నాణ్యం, ఉపయోగం గురించి బాగా రాశారు. కాకరకాయ వేపుడు కమ్మగా వుంటుంది. యోగా బామ్మకు వందేళ్లు నిండాలి. బస్తరు అందాలు బాగున్నాయి.

వాస్తురామచంద్ర, రాంజీనగర్,
నెల్లూరు

కనువిందు చేసిన బస్తర్ అందాలు

ఈ సంచికలో ఆకట్టుకునే బస్తర్ అందాలు చదివిన తర్వాత దట్టమైన అరణ్యం గల బస్తర్ ప్రాంతం ఎత్తులో ఉందనీ, అది చత్తీస్‌గఢ్‌లో ఉందని తెలుసుకున్నాం. అమాయక ప్రజలు వ్యాపారుల చేతిలో మోసపోవడం బాధాకరం. పెళ్లి కుదిరే సమయంలో వారి ఆచారాలు చదివి ఆశ్చర్యపోయాం. చిత్తుగా తాగి గొడవలు చేయడం, పరిష్కరించుకోవడం విచిత్రంగా అనిపించింది. చిత్రకూట్ గురించి, అక్కడ వున్న విశేషాల గురించి తెల్సుకున్నాం. దంతోవర్, బస్తర్‌లో ఉన్న ప్రాంతాలు, దేవాలయాలు, బస్తర్ స్వరూపం ఆకట్టుకుంది. ఇక్కడ ప్రవహించే ఇంద్రావతి నది ఎప్పుడూ ఎండదనే విషయాన్ని చదివి నమ్మలేకపోయాం. ఇక్కడి పట్టు పరిశ్రమ గురించి తెలుకున్నాం. మంచి వ్యాసం అందించినందుకు స్నేహకు అభినందనలు.

కామిడి సతీష్ రెడ్డి,
పరకాల, వరంగల్.

'జాతీయగీతం' ఆకట్టుకుంది

జాతీయగీతం గురించి స్నేహలో విపులంగా వివరించిన తీరు ఆకట్టుకుంది. జనగణమన గేయానికి స్వరాలు కూర్చింది రవీంద్రుడే అని చదివి విపరీతమైన వాత్సల్యమేర్పడింది. అలాగే రవీంద్రనాథ్ టాగూర్ గురించి, ఆయన రచనల గురించి సమూల సమాచారం అందించిన తీరు అలరించింది. అంతకుమించి వివిధ దేశాలలో జాతీయ గీతాల పేర్లతో పాటు స్వీకరించిన సంవత్సరం వంటివి తెలియజేయడం మరింతగా ఆకట్టుకుంది.

యర్రమోతు ధర్మరాజు,
ధవళేశ్వరం.

మనలోమాట ఆలోచింప చేసింది

రాష్ట్ర వ్యాప్తంగా కరువు కరాళనృత్యం చేస్తోంది. వర్షాలు లేక పొలాలు బీడువారాయి. రైతుల



ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. రైతు ఆవేదన, ఆక్రందనను మనలోమాటలో కళ్లకు కట్టినట్లుంది. త్రిపుర ప్రజల, మరియు అరుణోద్యమ పతాక పత్రిక "దేశర్ కథ" గురించి చాలా విషయాలు తెలుసుకున్నాం. పత్రిక ఉద్యమానికి గుండె వంటిది. సంపాదకుడు గౌతం దాస్ ఎదుర్కొన్న కష్టాలు మరువలేనివి. జాతీయ గీతం వివాదాస్పదమైనదే. నోబెల్ బహుమతి గ్రహీత, బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్పకవి అయిన రవీంద్రనాథ్ టాగూర్ రచించిన జాతీయగీతంలో ఇప్పటికీ 'అధినాయక జయహే' అని ఇంగ్లండ్ రాజును శ్లాఘించడం ఎంతవరకు అంగీకరించగలం? రాజ్యాంగానికే అనేక సవరణలు చేసినపుడు జాతీయగీతాన్ని మారిస్తే తప్పేంటి?

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

★



నవ్వుల్ - పువ్వుల్

పేరు

పండు : అమ్మా పక్కింటి ఆంటీ పేరేమిటి?

అమ్మ : జ్యోతి. ఎందుకురా అలా అడిగావ్?

పండు : మరి డాడీ ఏంటమ్మా...'డార్లింగ్' అని పిలుస్తారు?

అమ్మ : ఆ...

వంద నోటు

టీచర్ : ఏంటి సురేష్ స్కూల్‌కు లేటుగా వచ్చావ్?

సురేష్ : దారిలో ఒక అంకుల్ 100 రూపాయల నోటు పడేసుకున్నాడు సార్.

టీచర్ : వెరీగుడ్. అయితే అతనికి ఆ డబ్బులు వెతికి పెట్టడంలో హెల్ప్ చేశావన్నమాట.

సురేష్ : లేదు సార్. ఆయన వెళ్లేవరకు ఆ నోటుమీద నుంచుని వున్నాను.

- ఎన్. రేవతి, పలమనేరు.

ఏమో!



బుజ్జి : నేను చిన్నప్పుడు చార్మినార్ పైనుండి పడ్డాను తెల్సా.

చిట్టి : అయ్యో మరి చావలేదా? బతికేవున్నావా...

బుజ్జి : తెలియదు. చిన్నప్పుడు కదా. మర్చిపోయాను.

జాబ్

నరేష్ : చంద్రా... ఓ జాబ్ ఉంది. చేస్తావా?

చంద్ర : ఏం జాబ్‌రా. చాలా కష్టమైనదా?

నరేష్ : లేదురా. చాలా సింపుల్. చదువు కూడా పెద్దగా అక్కర్లేదు. పైగా సముద్రం మీద. జీతం కూడా ఎక్కువే.

చంద్ర : ఇంతకీ ఏం చేయాలి?

నరేష్ : మరేం లేదు. అప్పుడప్పుడు ఓడ ఆగిపోతే తొయ్యాలి అంతే!

చంద్ర : ఆ.....

అలవాటు

వియ్యంకుడు : మా అబ్బాయికి చుట్ట, బీడీ, సిగరెట్లు, కిళ్లీ, మందు... లాంటి చెడు అలవాట్లు లేవు. చాలా పొదుపు. ఎంగిలి చేత్తో కాకిని కూడా కొట్టడు చెల్లెమ్మా!

వియ్యపురాలు : మా అమ్మాయి కూడా చాలా పొదుపు. వంట సామాగ్రి, పప్పులు వగైరా లాంటివన్నీ ఇరుగు పొరుగు ఇళ్లనుండి అప్పు తెస్తుంది.

మతిమరుపు

వనజ : హలో... డాక్టర్ గారూ! మా వారికి మతిమరుపు ఇంకాస్త ఎక్కువ అయింది. ఓ సారి ఇంటికి వస్తారా.

డాక్టర్ : ఇంతకూ మీ ఆయన ప్రవర్తనలో వచ్చిన మార్పు ఏంటి?

వనజ : నేను ఆయన భార్యను కాదంటున్నారు డాక్టర్.

- జె. సుధాకర్ పట్నాయక్, కాకినాడ.

రాస్తా

(ఓసారి ఓ భారతీయుడు, జపాన్‌వాడు, అమెరికావాడు కలిసి మాట్లాడుకుంటున్నారు)

జపాన్‌వాసి : నేను యంత్రాలను బాగు చేస్తాను. ఎందుకంటే నేను మెకానిక్‌ని.

అమెరికన్ : నేను పాడైనవాటిని సరిచేసి అతికించి మళ్లీ ఎగిరేట్టు చేస్తాను.

ఇండియన్ : నేను ఆ విమానం మీద 'మేడ్ ఇన్ ఇండియా' అని రాస్తాను.

రేఖ

లెక్కల టీచర్ : ఒరే శీనూ! రేఖ అంటే ఏమిటో చెప్తావా?

శీను : మా చెల్లెలి ఫ్రెండు సార్.

జోక్స్ పంపాల్సిన మా చిరునామా : నవ్వుల్ పువ్వుల్ శీర్షికకు, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, మోటూరు హనుమంతరావు భవన్, 21/1, ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, హైదరాబాదు.

స్ఫూర్తి

ఆర్.రఘు,
సి.పి.ఎమ్ నగర కార్యదర్శి,
విజయవాడ.



చారిత్రక వెలుగు

నేను పార్టీ రాష్ట్ర ఆఫీసులో కార్యకర్తగా పనిచేస్తుండగా కామ్రేడ్ సాంబిరెడ్డి గారు (సుందరయ్య విజ్ఞాన కేంద్రం) అనంతపురం జిల్లాలో భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర క్లాస్ చెప్పమన్నారు. అప్పటికే కామ్రేడ్ నండూరి ప్రసాదరావు గారు రాసిన "స్వాతంత్ర్యోద్యమంలో కొన్ని పుటలు" మాత్రమే చదివి వున్నాను. నండూరి ప్రసాదరావు గారినే ఈ క్లాస్ చెప్పాలంటే ఏ పుస్తకాలు చదవాలని అడిగాను. కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ రాసిన "భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర" పుస్తకం చదవమన్నారు. తీరా ఆ పుస్తకం సైజు చూస్తే భయమేసింది. క్లాస్ చెప్పాల్సిన అవసరం, ప్రసాదరావుగారు వంటివారు చెప్పిన సలహా పనిచేశాయి. అది 31 అధ్యాయాలతో కూడిన దాదాపు 900 పేజీల పుస్తకం. నిజానికి అనంతపురం క్లాసులోపు ఆ పుస్తకం మొత్తం చదవలేకపోయాను. దానికి కారణం సమయం తక్కువ వుండడం కాదు. ప్రతీ పేజీలోని, ప్రతీ వాక్యం అందులో చెప్పిన ప్రతీ అంశం చాలా ముఖ్యమైనదిగా అనిపించడం వలన పుస్తకాన్ని వదలలేక, సమయం ముంచుకొస్తుందన్న భయంతో హడావిడి పడ్డాను. క్లాసు అయిన వెంటనే మరలా ఆ పుస్తకం చదవటం ప్రారంభించాను. పూర్తి చేయడానికి దాదాపు 3 నెలలు పట్టింది. పుస్తక పఠనం మీద ఏమాత్రం శ్రద్ధ లేని నన్ను పూర్తి చేసే దాకా వదలకుండా కూర్చోబెట్టిన గ్రంథం అది. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర గూర్చి ఎనలేని ఆసక్తి కలిగించిన పుస్తకం అది. ఆ రోజుల్లో రాష్ట్ర కేంద్రంలో ఎటుచూసినా స్వాతంత్ర్య పోరాట యోధులు, దాని వారసత్వంగా పెల్లుబికిన కమ్యూనిస్టు ఉద్యమయోధులు కనబడుతుండేవారు. ఎవ్వరిని కదిలించినా స్వాతంత్ర్య పోరాట అనుభవాలు చెప్పేవారు. కా॥ ఉద్దరాజు రామంగారు "కమ్యూనిస్టు కార్యకర్తలు మన దేశ చరిత్ర గూర్చి, మన సంస్కృతి నాగరికత గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని" 'గట్టిగా' చెబుతుండేవారు. బహుశా ఒక సాధారణ కార్యకర్త అయిన నన్ను ఆ వాతావరణం కూడా ఈ గ్రంథం చదవడానికి ప్రేరేపించిందని చెప్పవచ్చు.

"ఎపుడో జరిగిన చరిత్ర అంతా తెలుసుకోవలసిన అవసరం ఏముంది, ఈ రోజుకి ఏం కావాలో తెలుసుకుంటే సరిపోతుందికదా" అన్న పొరబాటు ధోరణి చాలా మంది కొత్తగా వచ్చిన కార్యకర్తల లాగే నాక్కూడా చాలా కాలం వుండేది. పాతని (చరిత్ర) నిరంతరం సమీక్ష చేసుకొంటూ వుంటేనే ప్రస్తుతాన్ని నిర్ణయించుకోగలం. భవిష్యత్తుని ప్లాన్

"జర్మన్ ఐడియాలజీ" అనే గ్రంథంలో మార్క్స్ "మానవజాతి చరిత్రను అధ్యయనం చేయాలనుకొన్నప్పుడు వ్యక్తులుగానీ సమూహాలు గానీ తమ గురించి తాము చెప్పకొనే దాన్ని బట్టి, రాసుకొనే దాన్ని బట్టి నిర్ధారణకు రాకూడదు. ఆనాటి ప్రజల భౌతిక పరమైన సామాజిక స్థితిగతులు, ఆ సమాజాన్ని నడిపించడానికి కారణమైన వివిధ వర్గాల మధ్య ఘర్షణను అధ్యయనం చేస్తేనే వాస్తవికమైన నిర్ధారణలకు రాగలము" అని చెప్పాడు. ఈ అవగాహన ఆధారంగా చూసినప్పుడు కామ్రేడ్ ఇఎమ్ఎస్ రాసిన ఆ భారీ గ్రంథం ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవడానికి, మరింత విస్తరించుకుంటూ ముందుకు పోవడానికి, సమీప చరిత్రలో ఏ వర్గాలు ఎటువంటి పాత్ర నిర్వహించాయి? ప్రస్తుతం దేశంలో దేశ రాజకీయాల్లో రెండు కూటములకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్, బిజెపిలది ఎటువంటి వారసత్వం? వారి వర్గ పునాది ఏమిటి? అన్నవి తెలుసుకోవడానికి ఇంత గొప్పగా తోడ్పడే మరో గ్రంథం ప్రస్తుతానికి లేదని చెప్పడం అతిశయోక్తి కాదు.

చేసుకోగలుగుతామని ముందుమాటలోనే కా॥ఇ.ఎం.ఎస్ తేల్చి చెప్పారు. ఈ అనుభవంతోనే ఆయన "పాలకులతో బేరసారాల ద్వారా సాధించుకునే స్వాతంత్ర్యం మన దేశాన్ని పెద్దగా ముందుకు తీసుకుపోదు" అని 1940లలోనే కమ్యూనిస్టులు వాదించారని చెప్పగలిగారు. ఈ పుస్తకం మొదటి నుంచి చివరిదాకా లోతుగా చదివితే రెండు ప్రత్యేకమైన అంశాలు స్పష్టంగా కనబడతాయి. ఒకటి -దాదాబాయి నౌరోజీ నుంచి తిలక్, గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, జిన్నా వంటి హేమాహేమీల గురించి, అదేవిధంగా 1800 సంవత్సరాలలో దక్షిణ భారత దేశంలో జరిగిన జమీందారీల తిరుగుబాటు, అంతకుముందు జరిగిన సన్యాసి, ఫకీరుల తిరుగుబాటు, వీటన్నింటికీ పరాకాష్టగా 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం. ఆ తర్వాత కాలంలో జరిగిన సహాయ నిరాకరణోద్యమాలు, ఖిలాఫత్ ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం, కమ్యూనిస్టు నాయకత్వాన జరిగిన వర్గ పోరాటాలు, వీటన్నింటికీ ప్రతీఘాతకంగా ముందుకు తేబడిన హిందూ మతోన్మాదం.. వాటన్నింటిలోని అనుకూలాంశాలు, ప్రతికూలాంశాలను గతితార్కిక పద్ధతిలో అత్యంత శక్తివంతంగా వివరించడం కనబడుతుంది. రెండు -వ్యక్తుల యొక్క, ఉద్యమాల యొక్క, వర్గ పునాదిని, వర్గ దృక్పథాన్ని కూడా చాలా సమర్థవంతంగా, మార్క్సిస్టు దృక్కోణం నుంచి వివరించడం జరిగింది. ఒక్క మాటలో చెప్పాలంటే చారిత్రక భౌతికవాద దృక్పథంతో 190 సంవత్సరాల భారతదేశ చరిత్ర విశ్లేషణతో నిండిన ఈ పుస్తకాన్ని అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతో వుందని నా అభిప్రాయం.

"ఆర్య, ద్రావిడులు తగాదా" నుంచి -"స్వాతంత్ర్యం గెలుపా ఓటమా" అన్న దాకా ప్రతి అధ్యాయం లోనూ ఆ కాలంలో జరిగిన ఏ ప్రధాన విషయాన్ని విస్మరించకుండా భావితరాలకోసం ఆ రకంగా గ్రంథస్థం చేయడం నిజంగానే ఒక గొప్ప విషయం.

"జర్మన్ ఐడియాలజీ" అనే గ్రంథంలో మార్క్స్ "మానవజాతి చరిత్రను అధ్యయనం చేయాలనుకొన్నప్పుడు వ్యక్తులుగానీ సమూహాలు గానీ తమ గురించి తాము చెప్పుకొనే దాన్ని బట్టి, రాసుకొనే దాన్ని బట్టి నిర్ధారణకు రాకూడదు. ఆనాటి ప్రజల భౌతిక పరమైన సామాజిక స్థితిగతులు, ఆ సమాజాన్ని నడిపించడానికి కారణమైన వివిధ వర్గాల మధ్య ఘర్షణను అధ్యయనం చేస్తేనే వాస్తవికమైన నిర్ధారణలకు రాగలము" అని చెప్పాడు. ఈ అవగాహన ఆధారంగా చూసినప్పుడు కామ్రేడ్ ఇఎమ్ఎస్ రాసిన ఆ భారీ గ్రంథం ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేసుకోవడానికి, మరింత విస్తరించుకుంటూ ముందుకు పోవడానికి, సమీప చరిత్రలో ఏ వర్గాలు ఎటువంటి పాత్ర నిర్వహించాయి? ప్రస్తుతం దేశంలో దేశ రాజకీయాల్లో రెండు కూటములకు నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్, బిజెపిలది ఎటువంటి వారసత్వం? వారి వర్గ పునాది ఏమిటి? అన్నవి తెలుసుకోవడానికి ఇంత గొప్పగా తోడ్పడే మరో గ్రంథం ప్రస్తుతానికి లేదని చెప్పడం అతిశయోక్తి కాదు.

★

కామ్రేడ్ ఇఎంఎస్ నంబూద్రిపాద్ రాసిన "భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర" పుస్తకం చదవమన్నారు. తీరా ఆ పుస్తకం సైజు చూస్తే భయమేసింది. క్లాస్ చెప్పాల్సిన అవసరం, ప్రసాదరావుగారు వంటివారు చెప్పిన సలహా పనిచేశాయి. అది 31 అధ్యాయాలతో కూడిన దాదాపు 900 పేజీల పుస్తకం. నిజానికి అనంతపురం క్లాసులోపు ఆ పుస్తకం మొత్తం చదవలేకపోయాను. దానికి కారణం సమయం తక్కువ వుండడం కాదు. ప్రతీ పేజీలోని, ప్రతీ వాక్యం అందులో చెప్పిన ప్రతీ అంశం చాలా ముఖ్యమైనదిగా అనిపించడం వలన పుస్తకాన్ని వదలలేక, సమయం ముంచుకొస్తుందన్న భయంతో హడావిడి పడ్డాను. క్లాసు అయిన వెంటనే మరలా ఆ పుస్తకం చదవటం ప్రారంభించాను. పూర్తి చేయడానికి దాదాపు 3 నెలలు పట్టింది. పుస్తక పఠనం మీద ఏమాత్రం శ్రద్ధ లేని నన్ను పూర్తి చేసే దాకా వదలకుండా కూర్చోబెట్టిన గ్రంథం అది. స్వాతంత్ర్యోద్యమ చరిత్ర గూర్చి ఎనలేని ఆసక్తి కలిగించిన పుస్తకం అది. ఆ రోజుల్లో రాష్ట్ర కేంద్రంలో ఎటుచూసినా స్వాతంత్ర్య పోరాట యోధులు, దాని వారసత్వంగా పెల్లుబికిన కమ్యూనిస్టు ఉద్యమయోధులు కనబడుతుండేవారు. ఎవ్వరిని కదిలించినా స్వాతంత్ర్య పోరాట అనుభవాలు చెప్పేవారు. కా॥ఉద్దరాజు రామంగారు "కమ్యూనిస్టు కార్యకర్తలు మన దేశ చరిత్ర గూర్చి, మన సంస్కృతి నాగరికత గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని" 'గట్టిగా' చెబుతుండేవారు. బహుశా ఒక సాధారణ కార్యకర్త అయిన నన్ను ఆ వాతావరణం కూడా ఈ గ్రంథం చదవడానికి ప్రేరేపించిందని చెప్పవచ్చు.





అరటిపండు లాగిస్తుంటే వుంటుందీ....



అంతా నావయసు వాళ్లేనోచ్

అవసరమైతే ఇరుగుపొరుగు దగ్గరా చేయి చాస్తుంటా



వీటితో వారంరోజులు సరిపెట్టుకుంటా!

బేబీ భీమ!

'ఎవరీ పిల్ల భీమ!' అనుకుంటున్నారా ఆశ్చర్యంగా. ఫొటోలు చూసినప్పుడు సరిగ్గా మాక్కూడా ఇలాగే అనిపించిందంటే నమ్మండి. అప్పడప్పుడు నెట్టు సముద్రంలో పడి ఈతకొట్టడం అలవాటుకదా. ఆ అలవాటులో భాగంగానే ఓరోజు ఈ బేబీ భీమను కనుగొన్నాం. పాప గురించి తెల్సాక మాత్రం చాలాసేపు నోరు తెరుచుకునే వుండిపోయామంటే నమ్మండి. అదేదో సొరంగమనుకొని ఎన్ని ఈగలు, దోమలు లోపలికెళ్లిపోయాయో వాటికే ఎరుక! అంత ఆశ్చర్యాన్ని కలిగించిన బేబీ భీమ గురించిన వివరాలు మీక్కూడా పంచుదామనిపించింది. మరి మీకు ఓకేనా!

ఏంటీ...అందుకే ఆత్రుతగా ఎదురుచూస్తున్నారా! మరైతే ఓకే!

ఈ పాప పేరు సుమన్ ఖాతున్. వయసు ఎంతా! ఐదేళ్లే. ఇప్పుడు అత్యంత ముఖ్యమైనది బరువు. ఆ ఎంతా...సింపుల్‌గా 75 కేజీలే.

అరే ఏంటది? మీరు కూడా మాకు లానే నోరు తెరుచుకుని వుండిపోయారు?

దీనికే మరీ అంత షాకవ్వకండి. ఇంకా ఇంతకంటే షాకిచ్చే అంశాలు చాలా చాలా వున్నాయి.

ఇప్పుడు మీ మదిలో మెదులుతున్న అతి పెద్ద అనుమానం? పాప తిండి గురించేకదా. అక్కడికే వస్తున్నామండీ. చూశారుగా. ఫొటోల్లో పాప ఏ లెవల్లో లాగిస్తోందో! వీటిని చూస్తే మనం మొదట అనుకున్న పేరు కరెక్టేననిపిస్తుంది.

ఈ పాప పది కేజీల బియ్యం, ఐదు కేజీల బంగాళదుంపలు, 24 గుడ్లు, ఆరు లీటర్ల పాలు లాగించేస్తుంది. ఈ మెనూ అంతా రోజుకు కాదులెండి. ఏదో వారం రోజులపాటు సర్దుకుంటుంది.

ఈ ఆహారం అందకపోతే మాత్రం కోపం వచ్చేస్తుంది. అమ్మానాన్నల మీదకు రాళ్లు విసురుతుంది. కేకలు పెడుతుంది. మీదపడి రక్కుతుంది. అంత కోపం మరి.

పాపం ఆకలికి తట్టుకోలేక ఇరుగుపొరుగు ఇళ్లకు వెళ్లి అడిగి తెచ్చుకుంటుంది.

అంత చిన్నపాప ఇంత తిండి తినడమా! అనిపిస్తోందికదూ. పాపం హార్మోన్ల ప్రభావం వల్లే ఇలా జరుగుతోంది తనకు.

తల్లిదండ్రులేమో పశ్చిమబెంగాల్లోని మెటియాలా గ్రామంలో కూలీనాలీ చేసుకునే వారు. వారానికి ఐదొందల రూపాయలు సంపాదించుకునే కడుపేదలు. వారు ఈ పాపను పెంచడమంటే ఎంత కష్టమో చూడండి. ఇంక ఆమెను ఆసుపత్రికేం తీసుకెళతారు? చికిత్స ఏం చేయిస్తారు?

స్థానిక వైద్యుడు పాపను పరిశీలించి ముంబైకో, ఢిల్లీకో తీసుకెళ్లి చికిత్స చేయించకపోతే పాపకు మరిన్ని సమస్యలు వస్తాయని చెప్పేశారు. అయినా వారికా స్థోమతు లేక అలా రోజులు నెట్టుకొస్తున్నారు.

ఈ అతి తిండే పాప ప్రాణాలకు ముప్పు తెస్తుందని కూడా వైద్యులు చెప్పినా ఏమీ చేయలేని పరిస్థితి వారిది.

ఆ అన్నట్టు మీకో విషయం చెప్పాలి!

పాప మూడు నెలల వయసులోనే అతిగా ఆహారం తీసుకోవడాన్ని తల్లిదండ్రుల గుర్తించారు. సంవత్సరానికి 15 కేజీల చొప్పున బరువు పెరుగుతోంది. ప్రస్తుతానికి శ్వాససంబంధ సమస్యతో పాప నడవడానికి కూడా ఇబ్బంది పడుతోంటే...తనకు వైద్యం చేసే డాక్టర్ల కోసం తల్లిదండ్రులు ఎదురుచూస్తున్నారు.

పాపం బేబీ భీమ.

★



చికెన్ కడాయి

చికెన్ అలెగ్జాండర్


చిల్లీ చికెన్ బర్గర్స్


చికెన్ పలావ్

చికెన్ కడాయి

కావాల్సిన వస్తువులు

చికెన్ -1 1/2 కిలోలు, ఉల్లిపాయలు -1 కిలో (ముద్దగా నూరాలి), టమాటోలు -1/2 కిలో (ముక్కలు కోయాలి), నెయ్యి - 300 గ్రాములు, కారం-20 గ్రాములు, పచ్చిమిరపకాయలు -8(నిలువుగా కోసుకోవాలి), లవంగాలు- 3-4, కరివేపాకు -15 గ్రాములు, కొత్తిమీర -1 కట్ట, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు -తగినంత

తయారు చేయు విధానం

కళాయిలో నెయ్యి వేసి వేడిచేయాలి. అందులో ఉల్లి ముద్దను వేసి, దోరగా పది నిముషాలు వేయించండి. టామాటో ముక్కలు, కారం, పచ్చిమిర్చి, యాలుకలు, ఉప్పు కలపండి. యాలుకలు, లవంగాలు కొద్దిగా చితకకొట్టి అందులో వేసి ఉడకనివ్వండి. దానిలో అల్లం-వెల్లుల్లి ముద్ద వేసి కలియబెట్టండి. మసాలా చక్కగా ఉడికిన తరువాత, కోసి శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలను అందులోవేసి బాగా కలబెట్టండి. సగం ఉడికిన తరువాత కరివేపాకు, కొత్తిమీర చల్లి మూతపెట్టండి. సన్నని మంటమీద చక్కగా మగ్గబెట్టి అన్నంలోగాని రొట్టెలతో కానీ వడ్డించండి.

చికెన్ అలెగ్జాండర్

కావాల్సిన వస్తువులు

చికెన్ ముక్కలు- 2 కప్పులు (ఉడికించినవి), నూడిల్స్ - 2 కప్పులు(ఉడికించినవి), పచ్చి బటానీలు -1 కప్పు (ఉడికించినవి), టామాటా సూప్‌పొడి -6 టేబుల్ స్పూన్లు, నీరు- కప్పు, టామాటో కచప్ -1/2 కప్పు, తరిగిన కొత్తిమీర -2 టేబుల్ స్పూన్లు, తరిగిన క్యాప్సికమ్ -1/2 కప్పు, వెన్న- 3 టేబుల్ సూన్లు, ఎండబెట్టి పొడి చేసిన రొట్టెముక్కలు- 1/2 కప్పు, ఉప్పు -తగినంత, మిరియాలపొడి-తగినంత.

తయారు చేయు విధానము

లోతున్న పాత్రలో నీరు పోసి, మరుగుతుండగా సూపు పొడి, ఉప్పువేసి బాగా మరగనివ్వండి. దించి దానిలో చికెన్ ముక్కలు, ఉడికించిన నూడిల్స్, బటానీలు, క్యాప్సికమ్ ముక్కలు, టమాటో కెచప్, కొత్తిమీర వేసి కలపండి. ఒక బేకింగ్ పాత్ర లోపలి భాగంలో కొంచెం వెన్న రాసి, ఈ మిశ్రమాన్ని అందులో వేయాలి. రొట్టె ముక్కల పొడి, వెన్న వేసి, 30 నిముషాల పాటు మధ్యరకం వేడిలో ఉడికించండి. చికెన్ రెడీ.

చిల్లీ చికెన్ బర్గర్స్

కావాల్సిన వస్తువులు

చికెన్ -1/2 కిలో, కార్న్‌ఫ్లోర్ -3 టేబుల్ స్పూన్లు, చిల్లీ సాస్- 3 టేబుల్ స్పూన్లు, మిరియాలపొడి -1/2 టీ స్పూను, అజినోమోటో (చైనా సాల్ట్) -1/2 టీ స్పూను, పల్చగా తరిగిన చీజ్ స్లైయిసులు -20, నూనె- వేయించేందుకు సరిపడినంత.

తయారుచేయు విధానము

చికెన్‌లో కొంచెం ఉప్పు వేసి ఉడికించాలి. ముక్క మెత్తగా ఉడికిన తరువాత తీసి, ఎముకల నుండి మాంసం తీసి వేరు చేయాలి. మెత్తగా కైమాలా కొట్టుకోవాలి. ఇందులో సాస్‌లు ఫ్లోర్, మిరియాలపొడి, అజినోమెటో కలిపి ముద్దచేయాలి. పలుచని పాపడ్లలా చేసుకుని నూనెలో వేయించండి. బర్గర్ బన్నులను తీసుకుని, రెండు స్లయిసులుగా కోసుకోవాలి. కింది స్లయిసుమీద ఒక ఛీజ్ స్లయిసును దానిపై చికెన్ కైమా వడను, ఆపైన మరో ఛీజ్ స్లయిసు వుంచి బన్నుమీద ముక్కను పెట్టి మొత్తం బర్గర్‌ను పిన్నుతో గుచ్చి వేడిగా వడ్డించండి.

చికెన్ పలావ్

కావాల్సిన వస్తువులు

చికెన్ కూరకు

చికెన్ -1 కిలో, ఉల్లిపాయలు (తరిగినవి)-3, లంవగాలు-4, నూనె-2 టేబుల్ స్పూన్లు, 1/2 కొబ్బరికాయ (పాలు తీసుకోవాలి), టమాటోలు-2, పసుపు -1/4 టీ స్పూను.

అన్నానికి

బాసుమతి బియ్యం- రెండు కప్పులు, జీలకర్ర -1/4 టీ స్పూను, నూనె- 1 టేబుల్ స్పూను, జీడిపప్పు -50 గ్రాములు, మసాలా ముద్దకు: పచ్చిమిరపకాయలు-5, వెల్లుల్లి రేకలు- 4(పొట్టు వలిచినవి), అల్లం-1 అంగుళం, దాల్చిన చెక్క-2 ముక్కలు, లవంగాలు-2.

(మసాలా అంతా ముద్ద నూరుకోవాలి)

చికెన్ కూర తయారీ

లవంగాలను, తరిగిన ఉల్లిముక్కలకు ఎరుపురంగు వచ్చేలా నూనెలో వేయించండి. కడిగి శుభ్రం చేసుకున్న చికెన్ ముక్కలను అందులోవేసి, నూరిన మసాలాముద్దను అందులో వేసి, మంట తక్కువగా ఉంచి, ముక్క ఉడికే వరకూ, పొయ్యిమీద ఉంచండి. ఉడికిన తరువాత కొబ్బరి పాలు, ఉప్పు, టామాటో ముక్కలు, పసుపు వేసి కలిపి, కూరను మగ్గన్వివండి. ఎసరుపెట్టి, మరుగుతున్నప్పుడు కడిగి నీరోడ్చి పెట్టికున్న బాసమతి బియ్యాన్ని ఉప్పును వేయండి. అన్నీ పొడిగా వుండేలా ఎసరు కొంచెం తక్కువ పెట్టుకోవాలి. ముద్ద కానీయకూడదు. నూనెను కళాయిలో వేసి, జీలకర్రను వేసి చిటపట లాడనిచ్చి, జీడిపప్పును అందులోవేసి దోరగా వేయించి, నూనెతో సహా అన్నంలో చల్లండి. ఆ అన్నంపైన వండిన చికెన్ కూరను చల్లి, కాస్సేపు మగ్గనిచ్చి, దించి వడ్డించండి.

★

సీరియల్

గని



జరిగినకథ:

గని కోసం, అందులో పనిచేసే కార్మికుల కోసం తన ప్రాణాలను బలిచ్చిన ఉద్యోగి కుటుంబం గురించి యాజమాన్యం పట్టించుకోదు. ఇది సుకుమార్‌ని ఆలోచింపచేస్తుంది. అక్కడినుంచి బయటపడేలా చేస్తుంది. అయితే ప్రస్తుతం చేస్తున్న చోట కూడా అంతకంటే మెరుగైన పరిస్థితులు లేక బాధపడుతుంటాడు. మరోవైపు అఖిల భారత గని కార్మిక సంఘాల సమావేశం జరుగుతుంది. దానికి బికాస్‌చౌదరి, దిలీప్ పాశ్వాన్ హాజరౌతారు. ఆ సమావేశంలో కీలక నిర్ణయాలు చేస్తారు. బొగ్గు గనుల్ని జాతీయం చేయాలని, సదరు చట్టం కోసం కార్మికులు ఉద్యమించాలని, సమ్మె చేయాలని అనుకుంటారు. ఆ తర్వాత...

తమిళ మూలం : కె. చిన్నప్పభారతి

అనువాదం : వి. వెంకటేశ్వర

(ఇరవై ఒకటవ భాగం)

"ఏ తలపుతో మీరీ ప్రశ్నలు లేవనెత్తారో తెలుస్తూనే ఉంది" అన్నాడు. అజ్ఞానంలో, ఆశాపాశంతో కట్టి పడేస్తుంది జీవితం. మనం రోజూ రకరకాల మనుషుల్ని చూస్తాం, కులుసుకుంటాం. వాళ్ళలో తెలివైన వాళ్ళు ఉంటారు. అలాగే అమాయకులూ ఉంటారు. మూర్ఖులూ ఉంటారు. ఇది వాస్తవిక దృశ్యం. మనుషుల్లో ఉన్న తారతమ్యం ఇదే" దాచుకోవాలనుకొన్నా దాచుకోలేని విసుగును దాచుకొనే ప్రయత్నం చేస్తూ అన్నాడు. కార్మికులు లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేయడం, తన కర్తవ్యంగా భావించి, చెప్పసాగాడు.

"శ్రమించడం ఒక్కటే మన సంస్కృతి అనీ, కర్తవ్యమనీ తరతరాలుగా భావిస్తూ వస్తున్నాం. సందులలో పందుల వలె జీవిస్తున్నాం. తల పైకెత్తి చూస్తే చాలు, అదే నేరంగా పరిగణించి, కొరడాలతో కొట్టారు. సలసల కాగే నూనె నెత్తిమీద పోశారు, చిత్రవధ చేశారు. మనకు ఉపాధి కల్పించే అన్నదాతలుగా నమ్మించి మనల్ని బురిడీ కొట్టించారు. ఇలాంటి నికృష్ట పరిస్థితుల నుంచి కాస్తయినా విముక్తి లభించడం మామూలు విషయం కాదు. ఇవాళ మనం హక్కు గురించి ప్రశ్నించగలుగుతున్నాం. ఈ వెసులుబాటు ఎలా కలిగింది? మన పూర్వీకులు తమ ప్రాణత్యాగంతో మన మార్గం కొంత సుగమం చేశారు. అంతే తప్ప, ఒకరి దయాదాక్షిణ్యాల వల్ల వచ్చింది కాదు. మన పెద్దలు మనలా అచేతనంగా ఉండి ఉంటే, మనమీ స్థితికి వచ్చే వాళ్ళం కాదు. ప్రస్తుతం మనం మరింత మెరుగైన జీవితం కోసం పోరాడాలి. సంఘం పెట్టుకోడానికీ, మన అవసరాలను తెలియజెప్పే అవకాశం దక్కించుకోడానికీ నెత్తురు చిందించలేదా? ఏదీ ఊరకే దొరకదు." అన్నాడు. అతడి స్వరంలో వేదన మిళితమై ఉంది. ఆవేశ తీవ్రత వల్ల మాట్లాడలేక పోతున్నాడు.

గరికను మేస్తోన్న ఎనుములూ, తెల్లగడ్డల వాసన, చీలిన చెట్ల బెరడు లోంచి వస్తోన్న పచ్చి వాసన, ఆవు పేడ వాసన, ఎండకు అట్టుడికి పోయిన భూమిలోంచి వెలువడుతోన్న పరిమళాలూ మనసును రంజింపజేస్తున్నాయి.

ఎలాంటి పరీక్షకయినా, సంకట స్థితినయినా ఎదుర్కొనగల వజ్ర సంకల్పంతోనూ మానసిక దృఢత్వంతోనూ బికాస్ తన మాటల్ని కొనసాగించాడు.

రథం లాగాలంటే ఒకరిద్దరి వల్ల అవుతుందా? ఊరంతా కలిసి లాగితేనే కదా రథం కదులుతుంది. గనుల్ని జాతీయం చేయడం కూడా అంతే. ప్రజలంతా కలిసికట్టుగా కదిలిత్తేనే సాధ్యపడుతుంది. ఇప్పుడున్న గనులు ఒకప్పుడు రైతులకు స్వంతమైన నేల, వాళ్ళను కూడా మనం కూడగట్టుకోవాలి. వాళ్ళ శ్రేయస్సును కూడా మనం దృష్టిలో ఉంచుకోవాలి. క్రరాచేయి ఈ రెండింటి సమన్వయం లేనిదే పాము చావదు.

ఒక కార్మికుడు –సమ్మె కట్టడమంటే ఏమిటీ? ఏం చేయాల్సి ఉంటుంది.

ఈ ప్రశ్నకు ఏం జవాబు చెబుతాడో సమ్మె వల్ల ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో తెలుసుకోవడంకోసం చెవులు రిక్కించి నిలబడ్డారు కార్మికులందరూ. వాళ్ళు దేనికోసమో నిరీక్షిస్తునట్టు తోస్తోంది.

"గనుల్ని జాతీయం చేయడం వల్ల ఒనగూడే మంచి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజల మద్దతు కూడగట్టాలి. దీని కోసం మనం ఓ రోజు సమ్మె చేయాలి. దీని పట్ల ప్రభుత్వం ఏ విధంగా స్పందిస్తుందో చూసి మన తదుపరి చర్య గురించి ఆలోచిద్దాం" అన్నాడు బికాస్. ప్రభాత సూర్యబింబంలా ప్రకాశిస్తోంది అతడి ముఖం.

చప్పిడి ముక్కు, పీక్కుపోయిన కళ్ళు, గూని వీపూ గలవాడొకడు మనం నోరు తెరిచి ఏదయినా అడిగితేనే జీతంలో కోత పాల్పడే యజమాన్యం ఏకంగా గనినే జాతీయం చేయమంటే ఊరుకుంటుందా?" గనిలో సుళ్ళు తిరుగుతోన్న వేడిగాలిలా ఉందతడి ప్రశ్న. నమ్మకాన్ని సూచిస్తున్నట్టుగా రెప్పల్లార్చి, స్నేహపూరితమైన చూపులతో బికాస్ ఇలా బదులు చెప్పాడు.

"ఇది మన కోరిక మాత్రమే కాదు, దేశ ప్రజలందరి కోరిక కూడాను. ప్రజలను సమీకరిస్తే అది ఉద్యమ రూపం దాల్చుతుంది. తర్వాత దానికి రాజకీయ స్వరూపం వచ్చేస్తుంది. అంతదాకా మనం చాలా కష్టపడాల్సి ఉంటుంది. అయితే, కార్మికుల చైతన్యం రాజకీయ శక్తులతో కలిస్తే వాళ్ళ బలం అజేయంగా మారుతుంది. ... మనం త్యాగం చేయక తప్పదు. పురిటి నొప్పులు లేకుండా బిడ్డ పుడుతుందా? కొన్ని సందర్భాల్లో కొద్దిపాటి నొప్పులే సరిపోవచ్చు" అనడంతో సమావేశం ముగిసింది.

సుదీర్ఘ చర్చలో మునిగిపోయి తిండినీ మరిచిపోయారు. సూర్యుడు పడమటి కొండల్లో

ప్రవేశించాడు. తెల్లని మేఘాల మీద సూర్యకిరణాలు అందంగా ప్రతిఫలిస్తున్నాయి. బంగారం కరిగి ప్రవహిస్తున్నట్టుగా ఉంది. సాయం సంధ్యా కాంతి మేఘాలు రకరకాల ఆకారాలుగా కనువిందు చేస్తున్నాయి.

✡ ✡ ✡

ఎండాకాలం వాన కురిసి, వెలిసిన రాత్రి. తొలిజాము గడిచింది. అగ్గిపుల్లలు వెలిగినట్టు అప్పుడప్పుడూ మెరుపులు మెరుస్తున్నాయి. విరామం లేకుండా వినిపిస్తోన్న పక్షుల కూత, ప్రశాంతంగా ఉన్న రాత్రి వాతావరణంలో నిద్రా భంగం కలిగించింది. నిద్ర పట్టని ముసలాడు పొద్దు పొడిచేదాకా అటూ, ఇటూ పొర్లుతూ గడిపాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఊరి పొలిమేర చేరుకొన్నాడు. ఆ ప్రదేశమంతా కానగచెట్లతో నిండి ఉంది. ముసలాడు పెళ్ళిళ్ళ పేరయ్యగా బతుకు వెళ్ళబుచ్చుతున్నాడు. పెళ్ళి సంబంధం కుదిరినా కుదరకపోయినా అతడికి భోజనము, చేతిఖర్చుల కింద మొత్తమూ ఇచ్చేస్తారు. పెళ్ళి సంబంధాలు వెతుకుతున్న తల్లిదండ్రులు, సంబంధం కుదిరితే తమ శక్తిమేరకు అతనికి మరికొంత ముట్టజెపుతారు.

పొద్దున్నే వీధిలో తారసిల్లిన ముసలాడ్ని చూసి ఓ యువకుడు "రాత్రంతా పక్షుల కూతతో నిద్ర చెడిందా తాతా? సమయం పొద్దూ లేని జీవాలు" అంటూ నర్మగర్భంగా పలికాడు.

ముసలాడు కళ్ళెగరేసి "వాటికి జతకట్టడం తప్ప మరో పని లేదు. మనుషులకైతే ఎన్ని పనులో ఎన్ని ఆందోళనలో! ముఖ్యంగా మీలాంటి యువకులకు మాకంటే ఎక్కువ" అన్నాడు బోసినవ్వు నవ్వుతూ.

ముసలాడి ఆంతర్యాన్ని గ్రహించాడు కుర్రాడు. కుక్క కాటుకు చెంపదెబ్బ లాంటి జవాబు చెప్పాలని నిశ్చయించుకొన్నాడు. "చీకట్లో గోడదూకి కుక్కకాటుకు గురికాను తాతా!" అన్నాడు. ముసలాడు వయసులో ఉన్నప్పుడు ఓ రాత్రి గోడ దూకి పొరుగింట్లో దూరుతుంటే అతడ్ని కుక్క కరవడం గురించి ఊరంతా ఇప్పటికీ చెప్పుకుంటుంది.

కుర్రాడు తనను దెబ్బ కొట్టాడని గ్రహించిన ముసలాడు దాన్ని పట్టించుకోనట్టు మొగం పెట్టి "ఈ కాలంలో పగటిపూటే కాస్త నయంగా ఉంది" అంటూ నిట్టూర్చాడు.

అతడు పళ్ళు తోముకుంటూ జమునాదేవి ఇంటికేసి అడుగులు వేశాడు. ఆమె కోరినట్టుగా ఓ అమ్మాయిని చూశాడు. చీకూచింతా లేని కుటుంబం. బికాస్ కార్యకలాపాల గురించి వాళ్ళకూ తెలుసు. ఈ విషయం జమునాదేవికి చెప్పాలి.

దారంతా దుక్కిదున్నిన పొలాలు. చాళ్ళలో పురుగుల్ని ఏరుకు తింటున్నాయి గుంపులుగుంపులుగా కాకులూ, గువ్వలూ. హఠాత్తుగా ఆ ప్రాంతమంతా రణక్షేత్రంలా కనిపించింది. కాకులు టపటపా రెక్కలల్లార్చుతున్నాయి. గట్టిగా అరుస్తున్నాయి. మగకాకి ఆడకాకి కాలివేళ్ళను పెనవేసుకోగా, ఆడకాకి దాని పట్టునుంచి తప్పించుకోవడానికి రెక్కలల్చారుతోంది. మగకాకి తన పట్టు జారవిడవకుండా మరింత రెచ్చిపోతోంది. ఈ అల్లరికి దుమ్మురేగి, చాళ్ళను కొంతమేర కప్పేసింది. చుట్టూ ఉన్న కొన్ని కాకులు ఈ దృశ్యాన్ని చూసి మేలమాడుతున్నట్టు గుసగుసలాడుకొంటున్నాయి. సిగ్గుపడుతున్నట్టు ఓరచూపులు చూస్తున్నాయి.

ఈ దృశ్యాలు ముసలాడికి తన యవ్వన కాలాన్ని గుర్తు చేశాయి. పల్లెల్లో సన్నకారు రైతులు పండించే గోధుమలు, ఉద్దులు వంటివి కొనుక్కునే వ్యాపారులు వాటిని బండ్లవాళ్ళకు అప్పగించి వెళ్ళిపోయేవాళ్ళు. బస్తాల్ని బండ్లలోకి చేరవేసి, వ్యాపారులు నిర్దేశించిన మండీలలో మొత్తం పంటను అప్పగించేవాళ్ళు. ఒక్కో బస్తాకు నాలుగణాలో, ఎనిమిదణాలో బాడుగ దక్కేది. రైతుల చేతుల్లో ప్రతిరోజూ డబ్బులు రాలవు గానీ, బండ్లవాళ్ళు మాత్రం ప్రతిరోజూ ఇంతో అంతో దక్కించుకొనేవాళ్ళు. ఆడవాళ్ళు దైనందిన జీవితానికి అవసరమయ్యే వస్తువులు తీసుకురమ్మని వీళ్లను పురమాయించేవాళ్ళు. అవి తెచ్చిచ్చి డబ్బులు పుచ్చుకొనేవాళ్ళు.

రోజూ చేతిలో డబ్బులు రాలుతుండడంతో అతడు పట్నం వెళ్ళి, మంచి భోజనశాలల్లో సుష్టుగా ఆరగించేవాడు. యవ్వన విభ్రమంతో తళతళలాడేవాడు. ఒక్కడే కొడుకు కావడంతో తల్లిదండ్రులకు గారాబం ఎక్కువ. ఇతడి రాబడి గురించీ, ఖర్చుల గురించీ ఎప్పుడూ పట్టించుకోలేదు. ఏ వయసుముచ్చట ఆ వయసులో తీర్చుకోవాలంటూ అతడి మానాన అతడ్ని వదిలేశారు.

ఆ ప్రాంతంలో జరిగే వివాహాల్లో స్త్రీపురుషుల మధ్య వయోభేదం ఎక్కువ. అందువల్ల ఆడవాళ్ళు పెళ్ళికాని యువకుల పట్ల ఆకర్షితులయ్యేవాళ్ళు. ఏ మాత్రం అవకాశం చిక్కినా దాన్ని యువకులు జారవిడుచుకోకుండా వినియోగించుకొనే వాళ్ళు. ఇంటికి అవసరమైన వస్తువులు తెచ్చిచ్చేటప్పుడు తమ ఖర్చుతో చిరుతిళ్ళు, రవిక ముక్కలు, తెచ్చిచ్చేవాళ్ళు. చపలచిత్తం లేని స్త్రీలు యువకుల ఆంతర్యాన్ని గ్రహించనట్టే ప్రవర్తిస్తూ మాటలమధ్యలో వాటి ధరెంతో తెలుసుకొని చెల్లించేసేవాళ్ళు. ఇలా తమకు లొంగని ఆడవాళ్లను ఎలాగైనా లొంగదీయాలన్న తపన యువకులది.

తెల్లవారుజామునే మగవాళ్ళు బయటికి వెళ్ళిపోయేవారు. స్త్రీలు ఇళ్లను కనిపెట్టుకుని వుంటారు. మగవాళ్ల వెళ్లిపోగానే ఆ ఇళ్ల దగ్గరకి వెళ్ళి, ఎనుముకు కట్టేసిన గొలుసును విప్పేసి, పెద్ద శబ్దం వచ్చేలా బలంగా నేలకేసి కొడతారు. ఎనుము గొలుసును విప్పదీసుకొని పారిపోతోందనుకొని పరుగుపరుగున వస్తారు స్త్రీలు.

వాళ్ళను చూడగానే అతడు "నేను దోవంట నడిచి వెళుతుంటే గొలుసు తెంచుకొని వచ్చిందీ ఎనుము. బయటకి పారిపోకుండా గొలుసును గట్టిగా పట్టుకొన్నాను. నువ్వు కూడా పట్టుకో" అంటూ స్త్రీకి గొలుసు అందించే నెపంతో చేతులు పట్టుకొంటాడు. ఒకచేత ఎనుము తాలూకు గొలుసు, మరో చేత ఆడదాని చేయి, తప్పించుకోవడానికి వీల్లేకుండా ఆడవాళ్ళతడి వశమౌతారు. దాంతో అతడు పెళ్ళి గురించి తలుచుకోనేలేదు. తల్లిదండ్రులు మరణించారు. యవ్వన ప్రాయమంతా కరిగిపోయింది.

కాకుల చేష్టలు అతడికి తన గొలుసాటను గుర్తు చేయడంతో, కొంత డీలాపడి మెల్లగా నడక సాగించాడు. మంచి సంబంధం కుదర్చగలిగితే గాలిలో తేలిపోతాడు. సరైన సంబంధం కుదర్చలేని పక్షంలో కుంగిపోతాడు. అలాంటప్పుడు అనుకొంటాడు అందరిలా పెళ్ళి చేసుకొని పిల్లాజెల్లా కలిగి ఉంటే, ముసలితనంలో (ఇంటి పట్టునే) కలో, గంజో దొరికేది కదా! అని.

ముసలాడు జమునా కుమారి ఇల్లు చేరాడు. బికాస్ ఉన్నాడేమోనని పరకాయించి చూశాడు. అతడు ఉన్నప్పుడు మాట్లాడడం కుదరదు. పెళ్ళి మాటెత్తితే చాలు, అగ్గిమీద గుగ్గిలమవుతాడు. అతడికి తన మాటలు వినే ఓపిక లేదు. తాను తక్షణం తిరుగుముఖం పట్టాల్సిందే. అదెలా ఉన్నా, అమ్మాయి తాలూకు వివరాలు సేకరించడం కోసం తాను పెట్టిన ఖర్చుకూ, పడ్డ శ్రమకూ మారుగా కొంత డబ్బు ముట్ట చెపుతారు. భోజనం పెడతారు. తన దగ్గరున్న ఆడ-మగ వివరాలు ఒకరివే అనేకులకు ఇస్తూ ఉంటాడు, పెళ్ళి కుదిరే దాకా. ఆ విధంగా ఎంతోమంది నుండి డబ్బు లభిస్తుంది. అలా ఒకదాని తరువాత ఒకటిగా కొత్తగా వివరాలు సేకరిస్తూ జీవనం గడుపుతున్నాడు.

ఇవాళ ఉపాహారం జమునా కుమారి ఇంట్లోనే చెయ్యాలని నిర్ణయించుకొని పళ్లోము పుల్లతోనే బయలుదేరి వచ్చేశాడు. అయితే బికాస్ ఇంట్లో ఉంటే మాత్రం ఏవో నాలుగు మాటలు చెప్పేసి తిరుగుముఖం పట్టక తప్పదు. ఉపాహారమూ లేదు, చేతిఖర్చులకు డబ్బూ రాదు.

ముసలాడు వెళ్ళేసరికి జమునా కుమారి అరుగుమీద కూర్చుని కాఫీ చల్లార్చుకొంటోంది. గిన్నెలోంచి ఓ అల్యూమినియం టంబ్లర్ లోకి కొంత కాఫీ వొంపి మొగుడికి అందించింది. తక్కినదాన్ని తన కోసం మరో గ్లాసులోకి వొంపుకొంటోంది. అరుగుమీద రెండు గ్లాసుల్ని చూడగానే, బికాస్ ఇంట్లో లేడని గ్రహించాడు ముసలాడు. ఓ పొడి దగ్గు దగ్గి వాళ్ల దృష్టిని ఆకర్షించాడు. జమున భర్త తల పైకెత్తి చూసి "ఓ రండి మామా రండి! పెందరాళే దయచేశారు. నాకు అమ్మాయిని చూశారా ఏం?" అంటూ పరాచికాలాడాడు.

(ఇంకావుంది)

చూద్దామా

అలీఘర్‌లో అలా అలా...



అలీఘర్ అనగానే ముందుగా మనకు స్ఫురించేది అలీఘర్ విశ్వవిద్యాలయం. వాస్తవానికి కొలువు తీరింది ఉత్తరప్రదేశ్‌లోనే అయినా దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన అలీఘర్‌లో ఈవారం అలా అలా విహరిద్దామా!

సర్ సయ్యద్ అహమ్మద్ ఖాన్ మొదటిసారి 1869లో ఇంగ్లాండ్ వెళ్లాడు. 19వ శతాబ్దపు ద్వితీయార్థంలో, ప్రపంచ నాగరికతలలో అద్వితీయంగా వెలిగిపోతోంది యూరప్. వారి జీవనశైలి ప్రాభవం చూసి ఆయన ముగ్ధుడైనాడు. అప్పటి మన దేశ ప్రజలను పోల్చి చూసుకున్నాడు. దారిద్ర్యం, అవిద్య, అపరిశుభ్రత, అనారోగ్యంతో మగ్గుతున్న ఇక్కడి పరిస్థితులు ఆయనను కదలించాయి. అప్పటికి అధిక సంఖ్యాకులుగా ముస్లింలు, ఇంగ్లీషు విద్యకు దూరంగానే వున్నారు. ప్రపంచ పరిణామాలను ఆకళింపు జేసుకోలేకపోతే వీరు మరింత వెనుకబడిపోతారు. ఇంగ్లీషు విద్య మాత్రమే దీన్ని అరికట్టగలదు. దీనితో ప్రభుత్వోద్యోగాలు, జీవన భద్రత, పలుకుబడి గౌరవం లాంటివన్నీ సమకూరుతాయి. కనుక ముస్లింలందరినీ ఇంగ్లీషు విద్యవైపు ఆకర్షించేందుకు, ఆయన జీవితమంతా ధారపోశాడు. ఇలా వెలసింది అలీఘర్ విశ్వవిద్యాలయం. సర్ సయ్యద్ ప్రభావం ముస్లింల మీద తీవ్రంగా ప్రసరించటం వల్ల వారందరి కలలకూ చిహ్నంగా రూపుదిద్దుకుంది విజ్ఞాన కేంద్రం.

ఇక్కడ మరో కోణం కూడా గమనించాలి. 1857 స్వాతంత్ర్య పోరాటం తరువాత బ్రిటిషువారి వైఖరి విభజించి పాలించే దిశలో మలుపు తిరుగుతోంది. హిందూ, ముస్లింల సామరస్యం ఎంత ప్రమాదకరమో, దానికి చెల్లించవలసిన మూల్యమెలా వుంటుందో వారప్పటికే చవిచూశారు. ఈరెండు వర్గాల వైరంలోనే ఇమిడి వుంది బ్రిటిషువారి శ్రేయస్సు. ఈ విధానం నిశ్శబ్దంగా, నిశ్చయంగా రూపుదిద్దుకుంటున్న రోజులవి. ఇలా మత ప్రాతిపదికన వెలసిన ఏ వ్యవస్థనైనా వారు మనస్ఫూర్తిగా స్వాగతించారు. అందుకే బ్రిటిషువారి సహకారం, వారి స్వప్రయోజనానికేననుకోండి దీనికి లభించింది.

ఆనాటి విద్యాధికులలో ఎక్కువ భాగం ప్రభుత్వోద్యోగాలకే పరిమితమైనది. దీనికి తోడు సర్ సయ్యద్ మితవాదధోరణి, బ్రిటిషు వారి పరిపాలన ఈ దేశంలో సుస్థిరంగా నిలచిపోవాలనే దశకు చేర్చింది విద్యాధికులను. కానీ మానవునిలో స్వతహాగా వుండే స్వాతంత్ర్య పిపాస, బ్రిటిషువారి నిరంకుశ పాలన, కొద్ది కాలంలోనే వీరికి ఈ భావజాలం నుండి విముక్తి, కలుగజేసింది. వారు జాతీయోద్యమాలకు దగ్గర కావటమే కాక, ఉద్యమాలకు నాయకత్వం వహించే స్థాయికి ఎదగటం జరిగిపోయింది. ఈ పరిణామాలాపేందుకు ముస్లిం మితవాద నాయకుల ప్రయత్నాలు ఫలించలేదు. ఇంతలో బెంగాల్ విభజన ఒక ఉద్యమంలాగా పరిణమించింది. ఇక బ్రిటీషువారు మరో ఎత్తు వేశారు. జాతిని మతపరంగా విభజించటం కాకుండా ఈ రెండు వర్గాలలోని మితవాదులనందరినీ కూడగట్టి జాతీయోద్యమానికి అడ్డుకట్ట వేయాలని ప్రయత్నించారు. ఇదీ ఫలించలేదు. ఈ కాలగమనంలో ఈ విశ్వ విద్యాలయ స్వరూప స్వభావాలు కూడా మరాయి. ప్రతిభకు, సాహసానికి మరో పేరుగా చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయిన అలీ సోదరులు, డాక్టర్ అన్సారీ, మౌలానా అబ్దుల్ కలాం అజాద్ వంటి మహానాయకులు ఈ విద్యాపీఠం నుంచి ఉద్భవించినవారే. మతం పేరు చెప్పి మరొకరి క్రింద దాస్యానికి తలొగ్గటం, దేశ సంపద కొల్లగొట్టబడుతూంటే నిరాసక్తులుగా నిలబడిపోవటం వీరి వల్ల కాలేదు. దేశభక్తితో గాంధీజీ ప్రభావంతో వీరు స్వాతంత్ర్య సమరంలోకి దూకారు. ఆ తరువాతి కాలంలో కూడా ఎన్నో రాజకీయమైన ఆటుపోట్లకు గురవుతూనే వచ్చింది విశ్వవిద్యాలయం.

అలీఘర్ జిల్లా కేంద్రం మాత్రమేకాదు. చాలా పెద్దనగరం. విశాలమైన వీధులు, ఆకర్షణీయమైన బజారులతో క్రిక్కిరిసి వుంటుంది. ముస్లిం జనాభా ఎక్కువ. వీరిలో ఎక్కువ మంది చేతిపనుల్లో నిష్ణాతులు. ఆర్థికంగా పైఅంతస్థులోనున్నవారు కులీనులు, సాంప్రదాయక వేషధారణలో తిరుగాడుతుంటే ఈ భారతావని వైవిధ్యంలోని మరో సుందర సుకుమార పార్శ్వం చూసి పులకించవచ్చు. ఇది మరో పంజాబ్, మరో కేరళ. ఇదే ఈ జాతి భిన్నత్వంలోని సౌందర్య పరిపాకం.

ఇక్కడనేక రకాల పోతపోసే బొమ్మలు, కొన్ని మెరుగుపెట్టి కొన్ని ఆక్సిడైజ్ చేసి, ఎక్కువగా విదేశాలకెగుమతి చేస్తారు. వీటిని కిలోల లెక్కన అమ్ముతారుగాని, చాలా ఖరీదే. ఇక్కడ బొమ్మలు చేసే కళాకారులంతా ముస్లింలే. ఇది పెద్దనగరం కనక కాఫీ దొరుకుతుంది.

ఇక్కడ చీటికి మాటికి గలాటాలు జరుగుతుంటాయి. సాయంత్రం 8గంటలకల్లా ఊరు మాటు మణిగిపోతుంది. సినిమాలు కూడా రోజుకి ఒకే ఆట. ఎక్కడ చూసినా పోలీసులు వారి వాహనాలు. ఇక్కడొక రకమైన రాత్రి కర్ఫ్యూ అమలు చేస్తున్నట్లుంది. ఉత్తరప్రదేశ్‌లో డెకాయిటీలకు తోడు హిందూ ముస్లిం గొడవలు రేగుతుంటాయి. చాలా మంది దగ్గర రివాల్వర్లుంటాయి. ఇది బ్రిటిషువారి ప్రసాదం.

మనం ప్రయాణం చేస్తున్న వాహనాలకు నక్క ఎదురువస్తే అరిష్టమని ఇక్కడి వారు భావిస్తారు. మరో సంగతేమంటే సికంద్రారావు జలేసర్‌ల మధ్య రాత్రి పూట ఎవరూ ప్రయాణం చేయరు. ఈ ప్రాంతంలో డెకాయిట్లతో చాలా ప్రమాదమట. ఒక్కోసారి పోలీసుల వేషాల్లో కూడా వచ్చి దోచుకుంటారని చెప్తుంటారు. ★



అలీఘర్ యూనివర్శిటీ

ఆరోగ్యం



పిల్లల మనస్తత్వం - పెద్దల ప్రవర్తన

పిల్లలకు శారీరక ఆరోగ్యమే కాదు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యం. వారిని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దాలంటే తల్లిదండ్రులు కూడా మానసికంగా ఆరోగ్యవంతులై ఉండాలి. పిల్లల మనస్తత్వంపై పెద్దల ప్రవర్తన ప్రభావం వంటి విషయాల గురించి ఈ వారం చెప్పుకుందాం.

డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్
సైకియాట్రిస్ట్
అనంతపురం.
9848316994

పిల్లలు తమ తల్లితండ్రుల నుంచి తిండి బట్టలు లాంటి అవసరాలు, సంరక్షణలే కాకుండా 'ప్రేమ' కూడా కావాలని కోరుకుంటారు. తనలో ఉన్న అందం బుద్ధికుశలత, మేధస్సు వంటి లక్షణాలను బట్టి కాకుండా తనను తానుగా ప్రేమించాలని కోరుకుంటారు. పిల్లలకు ప్రేమ అనేది నిరంతరం సలక్షణంగా అందిచాలి. పిల్లలు సహజంగా అల్లరి చిల్లరి పనులు చేస్తుంటారు. తల్లిదండ్రులు ఓ వైపు ప్రేమిస్తున్నామని నమ్మకాన్ని కల్గిస్తూ, వారు సక్రమంగా లేకపోవడానికి తగిన కారణాలను గుర్తించి పిల్లల మానసిక స్థితిగతులను బట్టి అర్థం చేసుకుని సవరించడానికి నిరంతరం ప్రయత్నించాలి. అలా పిల్లల్ని పూర్తిగా చదవగలిగితే అర్థవంతంగా నిజమైన ప్రేమను అందించగలుగుతాం. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రతి విషయానికి చిర్రు బుర్రులాడుతుంటారు. కొంత మంది అతిగారాబం చూపిస్తుంటారు. మరికొంత మంది పిల్లల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా వదిలేస్తుంటారు. కొన్ని కుటుంబాల్లో వారి అవాంఛనీయ స్థితులను బట్టి తల్లిదండ్రులు చాలా ఎమోషనల్‌గా ఉంటారు. ఇంకొందరు పిల్లలు పుట్టినప్పటి నుంచి ప్రతి విషయానికి ఎంతో ఆందోళన, గాబరా చెందుతూ ఇతరులను కూడా గాబరా పెడుతుంటారు. వివిధ రకాలైన తల్లిదండ్రుల ప్రవర్తన వల్ల పిల్లలపై ఒకరకమైన ప్రభావాన్ని చూపుతుంటాయి. పిల్లలు పెద్దయ్యాక జీవితంలో విపత్కర పరిస్థితులను తట్టుకోలేక ఎవరికి వారుగా కోపగ్రస్తులుగా చివరకు హంతకులుగా తయారయ్యే ప్రమాదముంది.

తల్లితండ్రుల ప్రేమకు నోచుకోని పిల్లలు మరియు అతిప్రేమ, గారాబంతో పెరిగిన పిల్లలు ఎక్కువగా న్యూరోటిక్స్‌గా తయారవుతారు. బాల్యంలో అతి సంరక్షణ లేకుండా తనను తాను సొంత వ్యక్తిత్వంతో పైకి ఎదిగిన పిల్లలు పెద్దయ్యాక మనోవిశ్వాసం కలిగి ధైర్యవంతులు, కార్యశూరులుగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. 'అతి ప్రేమ, అతి సంరక్షణ'ల మూలంగా పిల్లలు శారీరకంగా ఎదుగుతారు. కానీ, మానసికంగా పరిపక్వత రాదు. చిన్నప్పటినుంచి పిల్లలు తమ తల్లిదండ్రుల 'ఇగో'పై ఆధారపడి ఉండటంతో, తమసొంత 'ఇగో' సృష్టించుకోలేక, తన మానసిక అభివృద్ధిని నిర్వీర్యం చేసుకుంటారు. సొంత కోర్కెలు, స్వయం అనుభూతులంటే ఏమిటో తెలియవు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనలకు విలువ నివ్వకుండా, తమ ఆలోచనల ప్రకారం పెంచడంతో పెద్దయ్యాక జీవితంలో సమస్యలన్నీ ఎదుర్కోవాల్సి వచ్చినప్పుడు నిర్ణయాత్మకంగా వ్యవహరించ లేకపోతారు.

తల్లిదండ్రుల వారసత్వానికి మరియు ఆనందానికి పిల్లలు మూలాలు. అదే విధంగా తల్లిదండ్రుల నిరాశకు, దుఃఖానికి కారకులు కూడా పిల్లలే. అయితే పిల్లల నుంచి పొందే ఆనందానికి మరియు దుఃఖానికి పూర్తి బాధ్యత తల్లిదండ్రులదే. తల్లిదండ్రులే పిల్లల బాధ్యత విషయంలో తప్పక గ్రహించి భావి పౌరులుగా తీర్చిదిద్ది వారి మానసిక స్థితిని నిర్మించే నిర్మాతలుగా మారాలి. పెరిగే పిల్లల్లో 'అనుకరణ' చాలా ఉంటుంది. ఈఅనుకరణ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల నుంచి వస్తుంది. ఇంట్లోని తల్లిదండ్రుల ప్రవర్తన, పద్ధతులు పిల్లలకు తెలియకుండానే స్వయంగా మనసులో ముద్ర వేసుకుంటారు.

ఉదాహరణ: భార్యాభర్తలు పోట్లాడుకోవటం, బూతులు మాట్లాడటం, తాగుడు వ్యసనాలు, వ్యంగంగా మాట్లాడటం.

తల్లిదండ్రుల ప్రవర్తన సక్రమమార్గంలో లేకపోతే పిల్లల్లో అభద్రతా భావం పెరిగి 'పర్వర్టెడ్'గా మారే ప్రమాదముంది. తల్లిదండ్రులు కొట్లాడటం వల్ల వారిపై ప్రేమ తగ్గి చివరకు వారిని పట్టించుకోవడం మానివేసే ప్రమాదముంది. అలాగే పాఠశాలలోని ఉపాధ్యాయుల ప్రవర్తన ప్రభావం పిల్లలపై ఎంతో ఉంటుంది. అందుకే తప్పనిసరిగా ఉపాధ్యాయులు పిల్లలతో స్నేహపూర్వకమైన సత్సంబంధాన్ని ఏర్పరచుకుని, వారి లోటుపాట్లను సరిదిద్దాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. పిల్లల చదువు పట్ల, ఆటలపట్ల వారికి ఉన్న (ఐక్యు) ఆసక్తి పరంగా ప్రోత్సహించాలే కానీ, ప్రతి విషయంలో మనపిల్లలే ఫస్టుగా ఉండాలని కోరుకోకూడదు. అందరు పిల్లలు అన్ని విషయాల్లో ఫస్ట్ ఎప్పుడూ ఉండరు.

పిల్లల సామర్థ్యానికి మించి ఎప్పుడూ ఒత్తిడి చేయకూడదు. అలా చేస్తే వున్న సామర్థ్యాన్ని మరింత కోల్పోయే ప్రమాదం ఉంది. పిల్లలకు సమాజంలోని అన్ని విషయాల్లో పరిచయం, అవగాహన , మరియు జ్ఞానం కలిగించాలి. పిల్లలు చేసే ప్రతి విషయంలోను సృజనాత్మకత ఎక్కువ ఉండేలా ప్రోత్సహించాలి. అప్పుడే మరింత రాణింపు కలిగి ప్రత్యేకత ఉంటుంది. పిల్లల్ని ఎప్పుడూ ఎదుటి వారి కంటే తక్కువగా మరియు హేళనగా మాట్లాడకూడదు. అలా చేస్తే ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్స్ పెంచినట్లు అవుతుంది. ఇలా చేస్తే పిల్లలు మానసికంగా కృంగిపోయి వారి బంగారు భవిష్యత్తు కుంటుపడి మరింత వెనుకబడే ప్రమాదముంది. పెద్ద వారికి వచ్చే చాలా రకాల మానసిక జబ్బులకు మూలకారణం వారి బాల్య దశలో కలిగిన ఒడిదుడుకులేనన్న విషయం ఒక ఒక సర్వే లోతేలింది. విద్యార్థి దశలో అనేక రకాల మానసిక సమస్యలు ఎదురవడం సహజం. వీటిని గుర్తించి నివారణ చేయకపోతే వారు జీవితంలో సమస్యల్ని ఎదుర్కోలేని నిస్సహాయులుగా మిగిలిపోతారు.

పిల్లల్లో మానసిక రుగ్మతలంటే డిప్రెషన్ హైపర్‌యాక్టివిటీ, డిజార్డర్ యాంగ్జయిటీ, బుద్ధిమాంద్యం, ఆటిజమే కాండక్ట్ డిజార్డర్. ఈ లక్షణాలను తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు నిశితంగా గమనించి గుర్తించాలి. అవసరమైతే మానసిక వైద్యుడు సహాయ సహకారాలు తీసుకోవాలి. ప్రవర్తన లోపాలలో విసిగివేసారి పిల్లలను నిందించడం కంటే తమ పిల్లల ప్రవర్తనను ఎలా మార్చాలి అని ప్రతి ఒక్క తల్లిదండ్రులు తప్పక ఆలోచించాలి. తమ వంతు బాధ్యతతో తల్లిదండ్రులు పిల్లల్లోని ప్రవర్తనా లోపాలను ప్రాథమిక దశలోనే సరిదిద్ది భావిపౌరులుగా తయారు చేయగలిగాలి. అప్పుడే పిల్లల మానసిక ప్రపంచానికి ఆనందమైన వరాన్ని ఇవ్వగలుగుతాం.

★



పిల్లి బొమ్మ కావాలా

హాయ్ పిడుగులూ! పైన ఉన్న పిల్లి బొమ్మను చూశారుగా. ఎలా వుంది? బావుంది కదా. మరి మనం కూడా ఈ పిల్లిని ఎలా చేయాలో నేర్చుకుందామా.

<u>ఏమేం కావాలంటే ...</u>

ఊలు, కత్తెర, సూది, పెన్సిల్, మందపాటి అట్టముక్క

<u>ఎలా చేయాలంటే ...</u>

మందపాటి అట్టముక్క ను తీసుకోండి. ఈ అట్టముక్క అరచేతి వెడల్పులో గుండ్రంగా ఉండాలి. దానిమీద పెన్సిల్‌తో ఒక చిన్న వృత్తాన్ని గీయాలి. ఇప్పుడు ఆ చిన్న వృత్తాన్ని కత్తెరతో కత్తెరించి తీసేయాలి. ఇప్పుడు ఆ వృత్తంలో నుండి ఊలును బొమ్మలో చూపినట్లుగా టైట్‌గా, మందంగా చుట్టాలి. తర్వాత గట్టిగా ముడి వేసి అంచుల వెంబడి కత్తిరించాలి. ఇప్పుడు అది బంతిలా తయారవుతుంది. దాన్ని చుట్టూ సమానంగా చేసుకొని అలాంటిదే కొంచెం చిన్నగా మరొకటి తయారు చేసుకోవాలి. ఇక రెండింటిని సూదితో ఒకదానిపై ఒకటి పెట్టి అంటే చిన్నది పైన పెట్టి కుట్టాలి. చివరిగా కళ్ల దగ్గర చిన్నచిన్న గుండీలు, ముక్కు దగ్గర పెద్ద గుండీ పెట్టుకోవాలి. చూశారా పిల్లి బొమ్మ రెడీ అయింది.ఎలా వుంది? మీ ఫ్రెండ్స్‌కి చూపిస్తే ఏమంటారో తెలుసా... ఎలా చేశారు? మాక్కూడా నేర్పించవా అనడగాల్సిందే.... కాదంటారా చెప్పండి.

పదాలు చెప్పగలరా...

నేస్తాలూ!కింది పజిల్లో కొన్ని బొమ్మలు వున్నాయి. వాటికి సంబంధించిన పదాలు పక్కనే ఉన్న గళ్లలో రాయాలి. ఆ పదాల మొదటి అక్షరాన్ని కూడా ఇచ్చాం. ఇక మిగిలిన అక్షరాలను మీరు రాయండే.





జంతువులేవో చెప్తారా?

పిల్లలూ... పైన కొన్ని జంతువుల ఆకారాలు వున్నాయి. వాటి పేర్లేంటో చిటికెలో చెప్పేస్తారా.

దారి చెప్తే పోలా!



ఆకు గుర్రం

హాయ్ నేస్తాలూ! ఈ వారం మీకోసం గుర్రం బొమ్మ తీసుకొచ్చాం చూశారుగా. మీరు కూడా ఇలాంటి ఆకారాలున్న ఆకులు తీసుకుని తయారు చేయండే.





ఆ నత్త ఏదో?

పిడుగులూ...పైనున్న నత్తల్ని చూశారుగా. ఎలా వున్నాయి. అన్నీ ఒకేలా కనిపిస్తున్నాయి కదూ. కానీ వాటిలో ఒకటి మాత్రం మిగతా అన్నింటికంటే భిన్నంగా వుంది. అదేంటో వెంటనే చెప్పేయండి మరి.





చుక్కలు కలిపేద్దాం

జవాబులు

...:10

tram,tail, lips, mouse, ice cream, tray.



స్వైన్‌ఫ్లూ స్వైరవిహారం

స్వైన్‌ఫ్లూ...
పేరు వినబడితే చాలు
ఎక్కడలేని జాగ్రత్తలు
గుర్తొస్తున్నాయి.
తుమ్ము వస్తే చాలు
భయపడిపోతున్నారు.
ఇప్పటికే ఎందరినో
బలితీసుకున్న ఈ
మహమ్మారిని కట్టడి
చేసే టీకా (వాక్సిన్)
కోసం శాస్త్రవేత్తలు
శతవిధాలా
ప్రయత్నిస్తున్నారు. ఈ
సందర్భంగా అసలు
స్వైన్‌ఫ్లూ అంటే ఏంటి?
ఇదికూడా ఇతర ఫ్లూల
వంటిదేనా?
తీసుకోవలసిన
జాగ్రత్తలేంటి? చికిత్స
ఏంటి? నివారణా
చర్యలేంటి?
ప్రచారంలో ఉన్న
అపోహలు...
వాస్తవాలేంటి? వంటి
విషయాలు ఈ వారం
అట్టమీది కథలో...

- వి.నవీన్ కుమార్

అసలు ఫ్లూ అంటే?

వాస్తవానికి దీనిని విషపడిశం (ఇన్‌ఫ్లుయింజా) అని అంటారు. ఇన్‌ఫ్లుయింజా వైరస్ కారణంగా జలుబుతో కూడిన చలిజ్వరం వచ్చి ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. శ్వాస పీల్చడమే కష్టంగా ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే ఇది ప్రాణాంతకమైన వ్యాధిగా మారుతుంది.

ఆ కలయికే ఈ వైరస్

మానవులు, పక్షులు, పందులు వంటి జంతువుల్లో ఉండే ప్రభావవంతమైన వైరస్‌లు ఒకదానితో ఒకటి కలిసినప్పుడు వాటిలో ఏర్పడే జన్యుపరమైన మార్పులతో కొత్త వైరస్‌లు పుట్టుకొస్తాయని భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసిఎంఆర్) డైరెక్టర్ డాక్టర్ వివిఎన్ కతోచ్ పేర్కొన్నారు. ఏవియన్ ఫ్లూ, హ్యూమన్ ఫ్లూ, స్వైన్ ఫ్లూల మిశ్రమమే హెచ్1ఎన్1. తొలిసారిగా 1918-1919ల స్పెయిన్‌లో 'హెచ్1ఎన్1' ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వ్యాపించడంతో దాదాపు కోటి మంది జనాభా తుడిచిపెట్టుకుపోయింది. ఆ తర్వాత చాలా కాలానికి వ్యాధిని 1976లో అమెరికాలో గుర్తించారు. ఫిలిప్పీన్స్‌లో రెండేళ్ల కిందటే పందుల్లో ఈ వ్యాధి కనిపించింది. తిరిగి ఈ ఏడాది మెక్సికోలో మనుషులకు సోకింది. ఈ వైరస్‌కు చల్లని ప్రదేశాలంటే చాలా ఇష్టం. చలికాలం, వర్షాకాలంలో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంటోంది. ఒకవేళ ఈ వ్యాధి వ్యాపించినా త్వరగా గుర్తించలేం. ఎందుకంటే.. మనకు జబులు చేసినప్పుడు ఉండే లక్షణాలే దీనికీ ఉంటాయి. పరీక్షల ద్వారానే దీన్ని గుర్తించగలం. హెచ్1ఎన్1 సోకినట్లు భావిస్తున్న రోగుల్లో వైరస్ జన్యుపరమైన అమరికను పూర్తిగా పరిశీలించిన తర్వాత వ్యాధిని నిర్ధారిస్తారు. మనిషికి సోకిన ఈ ఇన్‌ఫ్లుయెంజాను జూనోటిక్ స్వైన్‌ఫ్లూ అంటారు. 'స్వైన్' అనేది ఇంగ్లీష్ పదం. 'పంది' అని దీనర్థం. సాధారణంగా పందులకు ఈ వ్యాధి వస్తుంటుంది. అందుకే దీనికి స్వైన్ ఇన్‌ఫ్లుయెంజా వైరస్ (ఎస్ఐవి) అంటారు. మధ్య పశ్చిమ అమెరికా సంయుక్త రాష్ట్రాలు, మెక్సికో, కెనడా, దక్షిణ అమెరికా, బ్రిటన్, స్వీడన్, ఇటలీ, కెన్యా, చైనా, తైవాన్, జపాన్‌లతో పాటు తూర్పు ఆసియా దేశాల్లోని పందులకు ఇవి వ్యాపిస్తుంటుంది. 1903లోనే ఈ వ్యాధిని గుర్తించారు. మందలో ఒక పందికి ఉంటే, రెండు మూడు రోజుల్లోనే మిగిలిన పందులన్నింటికీ వ్యాధి వ్యాపిస్తుంది.

మనుషులకు ఎలా సోకుతుంది?

పందుల వద్ద పనిచేసే వారికి ఇది వ్యాపించే అవకాశాలెక్కువ. పందుల రవాణా సమయంలో వాటితో కలిసి ప్రయాణించేటప్పుడు ఇది సోకే అవకాశాలు ఎక్కువవున్నట్లు 2004లో యూనివర్శిటీ ఆఫ్ లోవా నిర్వహించిన పరిశోధనలో వెల్లడైంది. పందుల ముక్కు తగిలినప్పుడు, అవి దగ్గినప్పుడు గాలి ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. హెచ్1ఎన్1తో బాధపడుతున్న వ్యక్తి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు గాలి ద్వారా ఇతరులకు సోకుతుంది. స్వైన్‌ఫ్లూ ప్రభావిత వస్తువులను తాకిన చేతులను నోట్లో, ముక్కులో పెట్టుకోవడం ద్వారా కూడా వ్యాపిస్తుంది. స్వైన్‌ఫ్లూ అంటు వ్యాధి. అయితే ఒకరి నుంచి మరొకరికి ఎంత సమయంలో వ్యాప్తి చెందుతుందనే విషయంలో ఎటువంటి స్పష్టతా లేదు. నీటి ద్వారా కూడా ఇది వ్యాప్తి చెందుతుందన్న వాదనలను

పరిశోధకులు కొట్టిపారేశారు. దీనిపై ఇప్పటి వరకు ఆధారాలు లభించలేదు. విమాన ప్రయాణాలు సర్వసాధారణమైన ఈ రోజుల్లో ఇది శరవేగంగా ప్రపంచాన్ని చుట్టబెట్టే అవకాశాలే ఎక్కువని, అందుకు తగ్గట్టుగా అంతా సన్నద్ధమవవటం మంచిదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది.

పరిశుభ్రతతో నివారణ

స్వైన్‌ఫ్లూ వ్యాధి నిరోధానికి శుభ్రతే అత్యంత ప్రధానమని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (సిడిసి) వైద్యులు చెబుతున్నారు. చేతులు ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలి. పౌష్టికాహారం తీసుకోవాలి. మానసిక ప్రశాంతత, సమయానికి నిద్ర చాలా ముఖ్యం. మట్టిని ముట్టుకోవడం, ఎక్కువసేపు అందులో తిరగడం చేయకూడదు. తమ్ము, దగ్గు వచ్చినప్పుడు నోటికి ఏదైనా గుడ్డను అడ్డుపెట్టుకోవాలి. తుమ్మినా లేదా దగ్గినా తర్వాత చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడుక్కోవాలి. జంతువుల వద్ద పని చేస్తున్న వ్యక్తులు చేతులకు గ్లోవ్స్ (చేతి తొడుగులు) వేసుకోవాలి. బస్సులు, రైళ్లు, విమానాల్లో ప్రయాణించి ఇంటికి తిరిగొచ్చాక, ఆహారం తీసుకోబోయే ముందు చేతులను వేడి నీళ్లు, సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం తప్పనిసరి. పుస్తకాలు, తలుపులపై కూడా హెచ్1ఎన్1 వైరస్ ఉంటుంది. వ్యాధిగ్రస్తులు ముట్టుకున్నప్పుడు అక్కడ చేరుకుని, బయటి వాతావరణంలో సమారు రెండు నుంచి ఎనిమిది గంటలపాటు బతుకుతుంది. స్వైన్‌ఫ్లూ రోగుల సమీపంలో ముఖానికి మాస్క్ తొడుక్కోవడం వల్ల కొంత వరకే ఉపయోగం ఉంటుందంటున్నారు నిపుణులు. మాస్క్ తొడుక్కున్నా పూర్తి స్థాయిలో వ్యాధి సంక్రమించదని చెప్పలేమంటున్నారు. అయితే, ముఖానికి కప్పేసే, ఎఫ్.డి.ఎ ఆమోదించిన మాస్కులు స్వైన్‌ఫ్లూ సోకడాన్ని నివారిస్తాయని చెబుతున్నారు. ఎన్ 95 రెస్పిరేటర్ (95 శాతం రక్షణ ఇచ్చే అత్యుత్తమమైనదిగా భావిస్తున్నారు) తప్ప మార్కెట్‌లో దొరికే మరే ఇతర మాస్కులు అంతగా ప్రయోజనం కలిగించవు.

మందులు

హెచ్1ఎన్1 వ్యాధి వ్యాప్తిని కొంత మేర నియంత్రించేందుకు సి.డి.సి కొన్ని మందులను సూచించింది. టామి ఫ్లూ, రెలెంజా మందులతో స్వైన్‌ఫ్లూ బాధితులకు చికిత్స చేస్తారు. అయితే వీటిని వ్యాధి సోకిన తర్వాత ఎంత త్వరగా వాడడం మొదలుపెడితే అంత మెరుగైన ఫలితాలు ఉంటాయని నిపుణులు అంటున్నారు. మందులు వాడడం వల్ల ఈ వైరస్ వారి నుంచి మరొకరికి సంక్రమించే అవకాశాలు కూడా తగ్గుతాయని భావిస్తున్నారు. మన దేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఈ మందులు ఉచితంగా ఇస్తున్నారు. బయటి మార్కెట్‌లో లభించడం లేదు. ఎందుకంటే వీటిని అతిగా వాడితే దుష్ప్రభావాలు కలుగుతాయి. స్వైన్‌ఫ్లూ బారినపడిన చిన్నారులకు ముఖ్యంగా 12 ఏళ్ల లోపువారికి టామి ఫ్లూ మందులు ఇవ్వడం మంచిది కాదని బ్రిటన్ పరిశోధకులు పేర్కొంటున్నారు. టామిఫ్లూ వల్ల కొందరు చిన్నారుల్లో వాంతులు, డీహైడ్రేషన్‌కు గురై పరిస్థితి మరింత దిగజారుతుందని పేర్కొన్నారు.

మానిటరింగ్ సెల్

న్యూ ఢిల్లీ : జాతీయ సాంక్రమిత వ్యాధుల నియంత్రణ సంస్థ (ఎన్‌ఐసిడి) టోల్ ఫ్రీ ఫోన్ నంబరు 011-23921401.

వెబ్‌సైట్...www.mofw.nic.in, www.nicd.nic.in

హైదరాబాద్ : ప్రభుత్వ ఛాతీ వ్యాధుల ఆసుపత్రి, ఎర్రగడ్డ.

హెల్ప్‌లైన్ నంబర్ : 040-2314939, 104, 92461 57447, 98499 02995

ఎందుకు మరణిస్తారు?

స్వైన్‌ఫ్లూ కూడా సాధారణ ఫ్లూ లాంటిదే. దీనిపై ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. సాధారణ ఫ్లూ కారణంగా ప్రతే ఏటా ప్రపంచ వ్యాప్తంగా రెండు లక్షల మంది చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అంతమాత్రాన సాధారణ ఫ్లూను ఎవరూ ప్రాణాంతకంగా భావించడం లేదు. స్వైన్‌ఫ్లూ కూడా అలాంటిదే. అయితే రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న ఆరేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడ్డవారు, శ్వాస సంబంధ సమస్యలున్న వారు స్వైన్‌ఫ్లూను నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం. ఇలాంటి వారు వెంటనే వైద్యం చేయించుకోవాలి.

వ్యాక్సిన్ ఎప్పుడు ?

వైరస్ కొత్తది కనుక, ఈ అంటువ్యాధికి ఇప్పటి వరకు వ్యాక్సిన్ అందుబాటులో లేదు. ప్రపంచాన్ని వణికిస్తున్న స్వైన్‌ఫ్లూ టీకాను అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా బ్రిటన్ శాస్త్రవేత్తలు దీని జన్యుపటాన్ని ఆవిష్కరించారు. సాధారణంగా వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే క్రమంలో మరింత బలోపేతమవుతుంది. అందువల్ల ఒకే టీకాను అభివృద్ధి చేయడం సాధ్యం కాదు. స్వైన్‌ఫ్లూను నివారించే టీకాలపై పరీక్షలు ఉధృతంగా సాగుతున్నాయి. సెప్టెంబరు నాటికి మొదటి టీకా అందుబాటులోకి వస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. చైనా, ఆస్ట్రేలియా, అమెరికా, బ్రిటన్, జర్మనీల్లోని పలు ఫార్మ కంపెనీలు ఇప్పటికే మొదటి బ్యాచ్ వ్యాక్సిన్లను రూపొందించి, పరీక్షలు కూడా పూర్తి చేశాయని బి.బి.సి పేర్కొంది. గర్భిణులు, పిల్లలకు ముందుగా వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చే అవకాశముంది. పూర్తిగా సురక్షితం అని నిరూపించిన తర్వాతే పాత పద్ధతుల్లోనే వ్యాక్సిన్ల రూపకల్పన జరిగిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాక్సిన్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ మేరీపాల్ కీని తెలిపారు. అయితే టీకా కావాలన్న హడావిడిలో సురక్షిత విధానాల్లో మాత్రం రాజీపడకూడదని నిపుణులు భావిస్తున్నారు.





మీడియా అతి

ప్రసార మాధ్యమం ఈ వ్యాధి గురించి అతిశయోక్తులతో ప్రచారం చేయసాగింది. ఏప్రిల్‌లో 2400 కేసులు ఇంకా పూర్తి నిర్ధారణ కాకుండానే పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. శాస్త్రీయ ఆధారాలతో నిమిత్తంలేని విధాన ప్రకటనలు వెలవడ్డాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి ప్రజల దృష్టిని మరల్చడమే ఈ ప్రచారం వెనుకవున్న ఆంతర్యం. దారిద్ర్యమూ, ఆర్థిక పతనమూ, జాతి ఘర్షణలు, విధ్వంసం, పౌర హక్కుల ఉల్లంఘన తదితర అంశాలను దాటవేయాలన్న కోర్కెతోనే ఐరోపాలో దీని గురించి ప్రచారం చేస్తున్నారు. జలుబులు, జ్వరం సాధారణంగా వస్తుంటాయి. వీటిని చూసి భయపడాల్సిన అవసరం లేదు. అయితే ఈసారి ప్రసార మాధ్యమం వ్యాధిని అతిగా చేసి చూపింది.

హెచ్చరికల కథేంటి?

మెక్సికో నుంచి వైద్య చికిత్సకు టెక్సాస్‌కు వచ్చిన 23 నెలల బాబు స్వైన్‌ఫ్లూతో మరణించడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ వ్యాధి ఉనికిని గుర్తించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ స్వైన్‌ఫ్లూపై అయిదో దశ హెచ్చరిక జారీ చేసింది. ఏవైనా రెండు దేశాల్లో ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి సోకుతున్నట్లయితే అది ప్రపంచమంతటా వ్యాపించడం అనివార్యమని చెప్పడానికి ఈ హెచ్చరిక జారీ చేస్తారు. వ్యాధిని అరికట్టేందుకు వ్యాధి నిరోధక టీకాల ఉత్పత్తిని పెంచాలని చెప్పేందుకు కూడా ఇదో సంకేతం.

లక్షణాలు : స్వైన్‌ఫ్లూ వచ్చిన వాళ్లకు జ్వరం, దగ్గు, గొంతులో గరగర, ముక్కు కారడం లేదా ముక్కు దిబ్బడ వేయడం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, చలిగా అనిపించడం, బాగా నీరసంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్ సోకిన చాలా మందిలో నీళ్ల విరేచనాలు, వాంతులు కూడా

విస్తృత ప్రచారం అవసరం

స్వైన్‌ఫ్లూపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రచారం జరగడం లేదు. కేవలం నగరంలో అక్కడక్కడా హోర్డింగులు కనిపిస్తున్నాయి. పోలియో, కుటుంబ నియంత్రణ కార్యక్రమం విజయవంతం అవడానికి ప్రధాన కారణం విస్తృతంగా ప్రచారం చేయడమే. నిరక్షరాస్యత తక్కువవున్న మన రాష్ట్రంలో దీనిపై మరింత ప్రచారం చేయాలి. దగ్గినా, తుమ్మినా ముఖానికి చేతి రుమాలు లేదా టిష్యూ పేపర్ అడ్డం పెట్టుకోవాలి. తర్వాత ఆ పేపర్‌ను జాగ్రత్తగా పడెయ్యాలి. ఒక వేళ చేతి రుమాలు, టిష్యుపేపర్ లేకుంటే చేతిని అడ్డంగా పెట్టుకోవాలి. మూడు రోజుల పాటు జ్వరం, దగ్గు, ముక్కులో నుంచి నీరు కారడం, ఒళ్లునొప్పులు, ఆకలి లేకపోవడం, గొంతు నొప్పి, తలనొప్పి, ఇవేకాక కొన్ని కేసుల్లో వాంతులు, విరేచనాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే తప్పనిసరిగా వైద్యుడ్ని కలవాలి. రోజుకు కనీసం నాలుగు నుంచి ఐదుసార్లు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. 12 నుంచి 17 ఏళ్ల వయసు వారు, గర్భిణులు కూడా వ్యాధిబారినపడే ప్రమాదం ఎక్కువ. గర్భిణులు, ఆస్తమా, మధుమేహం, గుండెజబ్బు ఉన్నవారు మరణించే అవకాశాలెక్కువ. వీటిపై నగరాలు, పట్టణాలే కాక గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రచారం చేయాలి. ఎందుకంటే మన దేశంలో ఇప్పుడు వస్తున్న స్వైన్‌ఫ్లూ కేసులు మధ్యస్థ దశకు చెందినవి. వ్యాధి గురించి అవగాహన కల్పించడానికి, ప్రచారం చేయడానికి ఇదే మనకు మంచి అవకాశం. సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలొస్తాయి. ఒక వ్యక్తి తనకు వచ్చింది స్వైన్‌ఫ్లూ అని గుర్తించడం ఎలాగో తెలుసుకుంటాడు. వచ్చాక స్వచ్ఛందంగా ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటాడు. తన నుంచి ఇంట్లోవారికీ, ఇతరులకీ రాకుండా జాగ్రత్తపడతాడు.

డాక్టర్ శేఖర్, ప్రజారోగ్య వైద్య నిపుణులు,
హైదరాబాద్.

నిర్లక్ష్యం తగదు

స్వైన్‌ఫ్లూ గురించి కంగారు పడాల్సింది ఉందా? అంటే ఉందని కచ్చితంగా చెప్పొచ్చు. మామూలు ఫ్లూకి, స్వైన్‌ఫ్లూకి లక్షణాల్లో పెద్దగా తేడా లేదు. అటువంటప్పుడు స్వైన్‌ఫ్లూ సోకినవారు ఎలా చనిపోతారు? అయితే ఇది అతి భయంకరమైన నవనిర్మాణమైన వైరస్ ఇది. రక రకాల రూపురేఖలు మార్చుకోవడం దీని గుణం. వైరస్ నేరుగా ఊపిరి తిత్తుల్లోకి ప్రవేశించే అవకాశముంది. దీంతో ఇన్‌ఫెక్షన్ న్యూమోనియా వస్తుంది. ఈ న్యూమోనియాకి 7 నుంచి 21 రోజుల్లో రెస్పాండ్ కాకుంటే ఊపిరితి త్తులు పూర్తిగా కుళ్లిపోతాయి. న్యూమోనియా వస్తే బ్యాక్టీరియా కారణం అను కుంటారు. మొదటి దశలో యాంటి బ్యాక్టీరియల్ మందులిస్తారు. బ్యాక్టీరియల్ మందులతో కోలుకోకుంటే యాంటి వైరల్ మందులిస్తారు. అప్పటికే వైరస్ కుళ్లిపోతుంది. అంతేకాక వైరస్ శరీరంలోని అన్ని భాగాలకు చేరుకుంటుంది. రోగి సరైన సమయానికి సరైన చికిత్స చేయించుకోకుంటే 15 నుంచి నెల రోజుల్లో మరణించే అకాశముంది.

డా॥వి.నాగేశ్వర్
కన్సల్టెంట్ ఇంటర్‌వెన్షనల్ పల్మనాలజిస్ట్,
హైదరాబాద్.

కనిపిస్తాయి. కొన్నిసార్లు ఇవి ప్రమాదకరం కావొచ్చు.

పిల్లలు : అయితే ఎగశ్వాస... లేకపోతే శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిగా వుంటుంది. శరీరం నీలం రంగులోకి మారుతుంది. ఆకలి ఉండదు. దాహం వేయదు. ఏమీ తినాలనిపించదు. తాగాలనిపించదు. చికాకు, విసుగు. మబ్బుగా ఉంటుంది. పదే పదే జ్వరం వచ్చిన లక్షణాలు కనిపిస్తాయి. దద్దుర్లతోపాట జ్వరం వస్తుంది.

పెద్దలు : శ్వాసపీల్చుకోవడంలో ఇబ్బంది పడతారు. కడుపులో, గుండెలో నొప్పి లేదా గుండె గాబరా. మబ్బుగా ఉంటుంది. మంచం పైనుంచి లేవాలనిపించదు. ఆగకుండా వాంతులవుతాయి. ఆకలి ఉండదు. దాహం వేయదు. ఏమీ తినాలనిపించదు. తాగాలనిపించదు. చికాకు. విసుగు. పదే పదే చలి జ్వరం లక్షణాలు ఉంటాయి.

కొన్ని గణాంకాలు

ఇప్పటి వరకు (ఆగస్టు 18)వరకు స్వైన్‌ఫ్లూ వల్ల భారత్‌లో 30 మంది చనిపోగా రెండువేల మందికి పైగా ఈ వ్యాధి సోకినట్లు తేలింది.

చాలా మహమ్మారులకంటే వేగంగా ఇప్పుడు ఇది 22 భారత నగరాలకు పాకింది.

168 దేశాల ప్రజలు గురికాగా 1.75 లక్షల మంది వ్యాధి బారినపడి 1400 మంది మృతి చెందారు.

అమెరికాలో 436 మరణాలు, 50,000 లకు పైగా కేసులతో అగ్రస్థానంలో ఉంది.

రోగం బారిన పడిన ప్రతి 1000 మందిలో 8 మంది మాత్రమే చనిపోతున్నారు.

వ్యాధి బారిన పడుతున్న వారి సంఖ్య పెరిగితే అది ప్రపంచ జిడిపిపై 3 శాతం మేర ప్రభావం చూపొచ్చు. మన దేశ జిడిపి 1 నుంచి 1.5 శాతం మేర పడిపోవచ్చు. ✶

స్వైన్‌ఫ్లూ అపోహలు -వాస్తవాలు

అపోహ : చేతులు కడుక్కుంటే వైరస్ సోకదు.

వాస్తవం : చేతులు కడుక్కోవడం వల్ల కొంత మేరకే వైరస్‌ను నిరోధించొచ్చు. చేతులు సబ్బునీళ్లతో శుభ్రంగా కడుక్కోవడం వల్ల చేతులకున్న సూక్ష్మక్రిములు, వైరస్‌లు నశిస్తాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంటోంది. అదీ 15 సెకన్లు కడుక్కోవాలి. అవకాశముంటే గోరు వెచ్చని నీళ్లతోనూ కడుక్కోవచ్చు. ఎందుకంటే బయట ఎక్కడెక్కడో తిరిగి, ఏవేవో ముట్టుకుంటాం. చేతికి అంటుకున్న సూక్ష్మక్రిములు, వైరస్‌లను ఈ విధంగా తొలగించుకోవచ్చు. తెలియని ప్రదేశాలకు వెళ్లినప్పుడు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. దగ్గుతూ,తుమ్ముతున్నవారికి తడిపదార్థాలు దూరంగా ఉంచాలి.

అపోహ : పంది మాంసం తింటే స్వైన్‌ఫ్లూ వస్తుంది

వాస్తవం : పంది మాంసం తింటే స్వైన్‌ఫ్లూ రాదు. ఎందుకంటే మాంసాన్ని కాల్చి లేదా ఉడికించి తింటారు. 160 డిగ్రీల ఫారెన్ హీట్‌లో వైరస్ చనిపోతుంది. పందుల ఫారాల్లో పని చేసే వారికి, పంది మాంసంతో వ్యాపారం చేసే వారికి, మాంసాన్ని కొట్టే వారికి వైరస్ సోకి స్వైన్‌ఫ్లూ వచ్చే అవకాశముంది. పందిమాంసంలో వైరస్ ఉండి, చేతికి చేరుకుని, ఆ చేతిని ముక్కులో పెట్టుకుంటే వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఇతని దగ్గరి నుంచి ఇంకొకరికి వస్తుంది.

అపోహ : ముఖానికి మాస్క్ ధరిస్తే రక్షణ ఉండదు.

వాస్తవం : ముఖానికి మాస్క్ పెట్టుకోవాలి. అంటే రుమాలు లేదా గుడ్డను చుట్టుకోవడం కాదు. స్వైన్‌ఫ్లూ వైరస్ శరీరంలోకి ప్రవేశించకుండా సర్జికల్ మాస్క్, ఎన్95 రెస్పిరేటరీ మాస్క్‌లు 70 శాతం వరకు నిరోధిస్తాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. మార్కెట్లో సర్జికల్ మాస్కులు లభిస్తున్నాయి.

అపోహ : తమ్ముతున్నా, దగ్గుతున్న వారి దగ్గరుంటే ఏం కాదు

వాస్తవం : మాట్లాడినా, దగ్గినా, తుమ్మినా, గాలిలోకి ప్రవేశించిన వైరస్ కనిపించని వైరస్ ఊపిరిద్వారా, నోటి ద్వారా వైరస్ వ్యాపిస్తుంది. స్వైన్‌ఫ్లూ రోగికి ఆరు అడుగుల దూరం కంటే ఎక్కువుండాలి. ఎందుకంటే ఒక వ్యక్తి దగ్గినా, తుమ్మినా తుంపర్లలోని వైరస్‌లు ఆరు అడుగుల లోపల వ్యాపించే శక్తి వుంటుంది. ఆ తర్వాత ఇవి వ్యాపించలేదు. దగ్గినప్పుడు ఆరు అడుగుల కంటే ఎక్కువ దూరంగా ఉండాలి

అపోహ : స్వైన్‌ఫ్లూ వైరస్ సోకితే జీవితాంతం ఉంటుంది.

వాస్తవం : స్వైన్‌ఫ్లూ వైరస్ శరీరంలోకి ప్రవేశించాక ఏడు నుంచి 10 రోజుల వరకు వ్యాధి ప్రబలే అవకాశముంది. చికిత్స చేస్తే సాధారణ స్థితికి చేరుకుంటారు.

అపోహ : దగ్గు, జలుబు ఉంటే డాక్టర్ దగ్గరికి వెళ్లకూడదు.

వాస్తవం : ఫ్లూ లక్షణాలు...గొంతు నొప్పి, జ్వరం, ఒళ్లునొప్పులు, తుమ్ములు, దగ్గులు, వాంతులుంటే ఒకటి లేదా రెండు రోజుల్లో డాక్టర్‌ను సంప్రదించాలి. వ్యాధి ముదిరితే ఊపిరితిత్తులు కుళ్లిపోయే అవకాశముంది. చికిత్స చేస్తే నయం అయ్యే అవకాశముంది. వెనువెంటనే చికిత్స చేయించుకోవాలి. ఆలస్యమైతే ఊపిరితిత్తుల్లో వైరస్ కుళ్లి రోగి మరణించే అవకాశముంది.

అపోహ : పెద్దవాళ్లకే, అదీ విదేశాల్లోని వారికే వస్తుంది.

వాస్తవం : స్వైన్‌ఫ్లూ వైరస్ అమెరికా నుంచి మన దేశంలోకి అంతర్జాతీయ ప్రయాణాల ద్వారా దిగుమతి అయ్యింది. ఇలా ప్రపంచమంతా విస్తరించింది. దీనికి వయసుతో నిమిత్తం లేదు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 90 ఏళ్ల సీనియర్ సిటిజన్ల వరకు వస్తుంది.

అపోహ : బలహీనంగా ఉంటే స్వైన్‌ఫ్లూ సోకిందనుకోవాలి.

వాస్తవం : ఇంతకు ముందు చెప్పుకున్నట్లు స్వైన్‌ఫ్లూ లక్షణాలు.... గొంతులో మంట, జ్వరం, దగ్గు, తమ్ములు, వాంతులు, జలుబు. కానీ, సాయంత్రం కాగానే బలహీనంగా ఉండడం, పొట్టలో నొప్పి, తలనొప్పి, కాళ్లు లాగడం స్వైన్‌ఫ్లూ లక్షణాలు కావు.

అపోహ : వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స చాలా ఖరీదు

వాస్తవం : మన రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్వైన్‌ఫ్లూ వ్యాధిగ్రస్తులను ప్రత్యేక వార్డుల్లో ఉంచి ఉచితంగా చికిత్స చేస్తున్నారు. నిర్ధారణ పరీక్షలు కూడా ఉచితమే.

కవిత్వము

ఏం చేయాలి?

- టి. రాధిక

ఏర్లు ఊర్లై పారిన భూములన్నీ నేడు
స్థన్యం లేని తల్లిలా
ఆశ్రయం పొందలేని అనాథలా
అఘోరిస్తోంటే
కరువు
రైతు పొలంలో విరగ పండుతోంది.
విదేశీ విత్తనాలూ ఖరీదైన పురుగు మందులూ
వచ్చీ రాని కరెంటూ – వెరసి
లేచీ లేవని రైతుని చావు దెబ్బ తీస్తోంది.
మొక్కవోని ఆత్మవిశ్వాసం
మొక్కలు మొలిపించదు.
సంజె వేళలో పోగుపడుతున్న మబ్బుల్ని లెక్కిస్తూ
తేమ గాలుల్ని మాలలు గట్టి పొలం చుట్టు తిప్పి
కావలి కూచుండు రాత్రంత,
చినుకు లేని ఆకాశాన్ని కునుకు లేకుండా చూస్తు.
జీవాలకు గ్రాసం కొరత,
పురుగు మందులపై అదుపు లేదు
సప్లై చేసిన విత్తనాలు మొలకెత్తవు
ఇన్ని తట్టుకున్నా
నీటి చుక్క విదల్చని కారుమబ్బు కాటేస్తే
పురుగుని చంపాల్సిన మందే పుస్తెని తెంపేస్తే
మొక్కై మొలవాల్సిన విత్తనం మోడైపోతే
భూమి తల్లి లోగిలి పొక్కిలి పొక్కిలి చేస్తే
ఎంగిలి చేత్తోని మెతుకులిసరదాయె.
పాలకులు పరమపద సోపానంలో పాములై మింగితే రైతు
వ్యవసాయమే చేయాలా
కాలం చేతుల్లో కాలనాగులై
పొలం గట్ల తుమ్మలకు తల పగలేసుకోవాలా!!

★

యాత్ర

- వడ్లకొండ భాస్కర్



ముగిసిపోని యాత్ర మాది
ఆగిపోని యాత్రికుని నేను
దోపిడీ, పరపీడనలపై
దుర్మార్గం, దురాక్రమణలపై
ముగిసిపోని యాత్ర మాది
ఆగిపోని యాత్రికుని నేను

పాలకులే పీడకులై
ప్రజలను భక్షిస్తుంటే
అణచబడ్డ, దగా పడ్డ
ప్రజల గొంతుకై
సాగిపోయే యాత్ర మా
ఆగిపోని యాత్రికుని నేను

ప్రజలకొరకు ప్రజలచేత
భూమికొరకు, భుక్తికొరకు
కూడుకొరకు, గూడుకొరకు
సాగే పోరాటాలపై పాలెగాళ్ళ మెప్పు కొరకు
అవాస్తవాలు "భట్టీ" యం వేసినా
నిజాల్ని "ఉండ" చుట్టి నీనైజాన్ని "వల్లి"ంచినా
ముగిసిపోని యాత్ర మాది
ఆగిపోని యాత్రికుని నేను

అసలు శత్రువులెవరో తెలుసుకోలేని
అజ్ఞానివి నీవు
పీడిత జనపక్షపాతులను పీనుగలుగా మార్చే
దుస్సంకల్పం, దుర్మార్గమే వర్గపోరాటమని,
"మావోయిజమని" మా యాత్రకు అడ్డంగా
శత్రువుతో మిలాఖతై "లాలూ (చీ) ఘడ్‌లు"
కట్టినా
ముళ్ళు రాళ్ళు అవాంతరాలెన్నున్నా
ముగిసిపోని యాత్ర మాది
ఆగిపోని యాత్రికుని నేను

వీరతెలంగాణ, తెభాగా, వాయలార్ వర్లీ
బషీర్‌బాగ్, ముదిగొండ ఒక్కొక్కటీ
ఒక్కో వీరగాథ మా యాత్రా చరిత్రలో
భారతావని యవనిక అరుణారుణవర్ణమైనా,
అవనిలోని అన్నార్తులు విముక్తమయ్యేదాకా
ఆగిపోము మేము
సాగిపోతూనే ఉంటాము.

దొరలూ, భూస్వాములూ, పాలెగాళ్ళ పాలకులై
ప్రజాఉద్యమాలకు సైంధవులై అడ్డుపడ్డా
ఎవడైనా, ఎప్పుడైనా గడ్డి పరకలే మా గమ్యం
ముందు
జారులూ, చక్రవర్తులూ, నాజీలు, హిట్లర్లూ
నైజామూ, జమిందార్లూ భూస్వాములను
రజాకార్లను కాలగర్భంలో కలపిన
వారసత్వం మా యాత్రది.

శ్రమదోపిడీ, పరపీడన
అవినీతి, బంధుప్రీతి
అరాచకం, అన్యాయం
అంధకార బంధురాలై
కమ్మిన ఈ దేశంకై
మేమంతా ఒక్కొక్కరు వందకోట్ల
సూర్యులమై వెలుగుతాము.
ఈ తిమిరంతో సమరం ముగిసేదాకా
ఆగిపోదు మా యాత్ర
అలసిపోము మేమసలు.

★

క్రైమ్ కథ

రూమ్‌నెంబర్ 302

- యర్నాగుల సుధాకరరావు

“ఈసారికి ఏదో సర్దుకుంటాను కానీ, మరోసారి ఇలా తక్కువ ధరకు ఇవ్వలేను. ఎందుకంటే మీకు కావల్సినది ఏదో ఒక అవయవం అయితే పర్వాలేదు. తెచ్చి ఇచ్చేస్తాం. ఇప్పుడు మీరు ఏమి కోరారు? మనిషి కిడ్నీలు కావాలి. మేము వాటిని తీయాలంటే మొత్తం శవం నడుందగ్గర గాటుపెడతాం. లోపలకి కత్తి పోనివ్వాలి. కిడ్నీ కత్తిగాటు పడకుండా తాటికాయలోంచి ముంజె తీసినట్టు తీయాలి. మేము డాక్టర్లం కాము కదా!” మద్యం గ్లాసు ఎత్తి గొంతులో పోసుకున్నాడు తోటి రాజన్

“అరే చుప్! ఏమిరా నిన్ను ఇంత ఖరీదైన హోటల్ రూమ్‌కి ఎందుకు తెచ్చానుబే. పైగా లాప్‌టాప్‌లో శవంలోంచి కిడ్నీ ఎలా తీయాలో నీకు పదేపదే చూపిస్తున్నాం. డబ్బు గుంజుతారు. చెప్పిన పనిచేయరా? ఇది నగరం. వేరే హాస్పిటళ్లలో ప్రయత్నిస్తే దొరక్కపోవు. నీకు తెలియదేమో బతికున్నోడి కిడ్నీకూడా నీకు ఇచ్చిన ధరకు ఇచ్చేవాళ్లున్నారు.” చెప్పాడు ప్రయివేట్ మెడికల్ కాలేజి మేనేజర్ బాషా.

“చాలా రిస్కు సార్. మార్చురీలో మనమెంతసేపున్నా పర్వాలేదు. అక్కడ దుర్వాసన మాకు అలవాటయ్యింది కనుక భరిస్తున్నాం.మీకోసం మొదట్లో నాలుగు ఆడ శవాలు రెండు మగ శవాలు రెండు చిన్నపిల్ల కాయ శవాలు ఎలా తెచ్చి అప్పగించాను? అప్పుడు మీరే నమ్మలేక పోయారు. ‘ఎలా తెస్తున్నావు?’ అని అన్నారు. సార్ ఆసుపత్రిలో చచ్చేవారిని కొంత మంది వదిలిపోతారు. వాటిని మీకు డైరెక్టుగా అమ్ముకోవడానికి లేదు. పాతిపెట్టాలి. ఆతరువాత ఏరాత్రిమీదో పోయి గొయ్యి తవ్వి మీకు అప్పగిస్తున్నాను. ఇదంతా రిస్కే. పరమ దుర్వాసన. మీరు చెల్లింపులు తక్కువగానే ఇస్తున్నారు. అందుకే నాతో ఉన్నతోటీలు వద్దుగాక వద్దు అని ఈబిజినెస్ లో లేరు. ఇక నేను చేయలేను. ఇలాంటి తప్పుడు పనులు ఎన్నాళ్లో సాగవు గాక సాగవు.” తోటి ఒకరకంగా తెగేసి చెప్పాడు.

“ఇక మీదట ఇవ్వలేనంటావు.నీవు కొత్తగా పెట్టిన మెడికల్ కాలేజితో డీల్ పెట్టుకున్నావు. నాకు తెలుసు మీతోటీల వ్యవహారం. నీకు నేనిచ్చింది ఎక్కువే. మాకంటే ధర ఎక్కువ ఇచ్చేవాడికి శవాలు ఇచ్చేందుకు సిద్ధపడ్డావు. నువ్వన్నట్టు ఎన్నాళ్లో ఇలాంటివి సాగవు.సరే నీఇష్టం” చెప్పి లేచాడు బాషా. తోటి పాలథీన్ బ్యాగ్‌లో చుట్టిన పార్సెల్ ఇస్తే బాషా తన సూట్‌కేసులో పెట్టుకుని అతడికి కొన్ని కరెన్సీ నోట్లు అందించేసి ఆగదిలోంచి ఇద్దరు వెళ్లిపోయారు. రూమ్ నెంబర్ 302లో రెండు రోజులవరకు ఎవరూ దిగలేదు. రిటైర్డు పోలీసు అధికారి తన భార్యతో దిగాడు. ఆయన ఏదో మెడికల్ చెకప్‌కు వచ్చాడు. ఆయనకు ఏరోగం లేదని చెకప్‌లో తేలింది. దాంతో ఆనందంగా హోటల్‌లో దిగి రెస్టు తీసుకున్నారు. ఆయన్ని పలకరించడానికి ఆయన సర్వీసులో ఉండగా ఉన్న పోలీసులు అక్కడ పని చేస్తున్నవారు వచ్చారు. అందులో టూటవున్ ఎస్ఐ ప్రదీప్ వచ్చి పండ్లు తెచ్చి టీపాయ్‌మీద పెట్టాడు. తర్వాత ఏదో మాట్లాడు కుంటుండగా ప్రదీప్ ముక్కుపుటలు ఎగరవేసి “సార్! ఇక్కడ ఏదో బాడ్‌స్మెల్ వస్తోంది గమనించారా?” అని అడిగి రూమ్‌లో అన్నివైపులా చూశాడు.

“ఇక మీదట ఇవ్వలేనంటావు. నీవు కొత్తగా పెట్టిన మెడికల్ కాలేజితో డీల్ పెట్టుకున్నావు. నాకు తెలుసు మీతోటీల వ్యవహారం. నీకు నేనిచ్చింది ఎక్కువే. మాకంటే ధర ఎక్కువ ఇచ్చేవాడికి శవాలు ఇచ్చేందుకు సిద్ధపడ్డావు. నువ్వన్నట్టు ఎన్నాళ్లో ఇలాంటివి సాగవు.సరే నీఇష్టం” చెప్పి లేచాడు బాషా.

ఆ దంపతులు తలాడించి “నిజమే ఏదో వస్తోంది. ఎలక చచ్చిన ట్టుంది.చూడు హోటల్ మేనేజర్‌కు పిలిచి చెప్పవయ్యా” రిటైర్డు అధికారి పడుకునే పాతవిధానంలో ఆదేశించాడు. యస్.ఐ క్షణాల్లో మేనేజర్‌ను పిలిపించి విషయం చెప్పాడు. బోయ్సు వెతికారు. నేలమీద ఎర్ర కార్పెట్ ఒకచోట ఉబ్బుగా ఉంటే దాన్ని చూశారు.అక్కడే దుర్వాసన వస్తోంది.పాలథిన్ కవర్ చీమలు పట్టి ఉంది. ప్రదీప్ కర్రతో కదిపిచూశాడు. తెగిన మనిషి చెయ్యి కన్పించింది. అదిరిపడ్డారు అంతా. ఆరూమ్‌లోంచి దంపతులను పక్క రూమ్‌కి పంపేసి దర్యాప్తు చేపట్టాడు ప్రదీప్. కుళ్లిపోయిన రెండు అరచేతులున్నాయి. క్లూస్‌టీమ్ వచ్చి అక్కణ్నించి ఆచేతులను తీసుకుని వెళ్లిపోయింది. ఆరూమ్‌లో ఇంతకు ముందు ఎవరున్నారో ఆరాతీశాడు. తీగలాగితే డొంక కదిలింది. మెడికల్ కాలేజి మేనేజర్ బాషాను పట్టుకున్నారు. “ఎవరిని హత్యచేశావు? తెగిన చేతులు రెండు ఇక్కడ కార్పెట్ కిందపడేసి నీవు పీకలుదాకా తాగి పోయావని తెలుస్తోంది. మిగిలిన శవఖండాలు ఎక్కడ?”అని అడిగాడు ప్రదీప్. ముందే ఏదో హత్య జరిగిఉంటుంది. తనకు తెలియకుండానే మెడకు చుట్టుకుందని బాషా దడుసుకుని “ఆరోజు నేను రూమ్‌లోకి వచ్చేసరికి ఎలాంటి దుర్వాసన లేదు.నాకు హత్య చేసే కక్షలు లేవు” అని చెప్పాడు. పోలీసులు రెండు రోజులుంచారు. అప్పటికే చాలా కథలు షికారు చేశాయి. ఫలానా వాడు బాషా చేతిలో హతుడయ్యాడని మరింతగా ఉచ్చు బిగుసుకుంది. భాషా ఒప్పుకో. నీగురించి రోజుకో కథనం వెలువడుతోంది అని పత్రికలు మీదపడేశాడు ప్రదీప్.

తెగిన చేతులు పార్సెల్ చూసి అదిరిపడి విషయం మొత్తం చెప్పాడు. “సార్ నేను మెడికల్ కాలేజి మేనేజర్‌ను. నేను ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో దిక్కుమాలిన శవాల అవయవాలు కొనుగోళ్లు చేస్తుంటాను. ఆరూమ్ లో తోటి రాజన్ నేను కలుస్తాం. వాడికి ఫలానా అవయవం కావాలి అంటే మార్చురీలో శవంలో లోపల పార్టుని తీసేసి, శవాన్ని కుట్టేసి తెచ్చి ఇచ్చేలోపు కుళ్లిపోకుండా దానికి మేము ఇచ్చే లోషన్లు పూసి పాలథిన్ బ్యాగ్‌లో వేసి పేపర్లు చుట్టి తెచ్చి ఇస్తాడు. ఇదిచట్టరీత్యా నేరమే.కానీ తప్పదు. చచ్చేవాడి కళ్లు దొరుకుతాయి కానీ, కిడ్నీలు, లివర్ మెదడు దానంగా ఇవ్వరు. చట్టపరంగా వెడితే ఇన్‌టైమ్ తీసుకురాలేం. డబ్బు పడేస్తే ఇలా అంటే అలా ఇచ్చేస్తారు ఈతోటీలు”

పోలీసులు వెంటనే తోటి రాజన్‌ను తెచ్చారు.అతడు “నేను మార్చురీలో శవాల అవయవాలను తస్కరించి అమ్ముకుంటాను. అయితే ఆరోజు మరో మెడికల్ కాలేజీవారికి రెండు తెగిన చేతులు పార్సెల్ ఇద్దామనుకుని ఈబాషాకు ఇవ్వాల్సిన కిడ్నీల పార్సెల్‌తో తెచ్చాను. నేను వేరే మెడికల్ కాలేజీతో డీల్ పెట్టుకున్నట్టు బాషాకు తెలియకూడదని రూమ్‌లోకి రాగానే నాచేతి సంచిని ఒకమూల పెడతాను. అప్పుడే కార్పెట్ కింద అవయవాల పార్సెల్ ఒకటి దాచాను.రూమ్‌లో బాషా ఈఅవ యవాలు కొన్నప్పుడు ఎందుకో ఎక్కువగా తాగుతాడు. విరక్తిగా మాట్లాడతాడు. నేను మరి అవయవాలు సప్లయ్ చేయను” అని చెప్పడంతో ఆయన నాపై గుఃయ్‌మన్నాడు. దాంతో కార్పెట్ కింద పార్సెల్ తాగిన మైకంలో మరిచి వెళ్లిపోయాను. తర్వాత రెండురోజులు సెలవుపెట్టి చేతిలో ఉన్న డబ్బుతో మద్యంలో మునిగితేలాను” ఏ ఒక్కటి దాచకుండా చెప్పాడు.

మూడురోజులు ఇదిగో తోక అదిగో పులి కథనాలతో నగరం అల్లల్లాడింది.చివరికి కథ తుస్సుమంది.పోలీసులు కేసు కొట్టేశారు. ★

సమ్‌థింగ్ స్పెషల్



కందిపప్పు కబుర్లు

- డా॥కాకర్లమూడి విజయ్

కందిపప్పు ఈ మధ్య కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఏదో మంచి వార్తలలో కాదు. విపరీతంగా పెరిగిన ధరవల్ల!

మనకి అంత విలువైనదా కందిపప్పు? అనే ప్రశ్న తొలుస్తూనే ఉంటుంది ఎప్పటికీ! కందిపప్పు తినకుండా ఉండలేమా? కందిని వంటలలో చేర్చకుండా బతకలేమా? ఉండవచ్చేమో కానీ మన వంటకాల్లో 'పప్పు'కున్న ప్రాశస్త్యం అంతా ఇంతా కాదు. అసలు పప్పు లేని భోజనం అనూహ్యం. భోజనంలో సింహభాగం పప్పుతోనే తింటాం. చాలామంది మొత్తం దాంతోనే లాగించేస్తారు కూడా. అయితే ఇంకొంతమంది పప్పు లేకుండా కూడా జీవిస్తుంటారు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. కందిపప్పు కమ్మని రుచి భోజన ప్రియులను దాసోహం అనేలా చేసింది. అందుకనే దాని ఉత్పత్తి ఏమాత్రం తగ్గినా గిరాకీ తగ్గదు. పైగా ధరలు ఆకాశాన్నంటుతాయి.

ఎక్కడ పుట్టిందంటే...

కందిపప్పు ఆసియాలోనే పుట్టింది. కనీసం మూడు వేల సంవత్సరాలకు పూర్వం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా కంది సాగు జరుగుతోంది. కానీ మనదేశం, తూర్పుఆఫ్రికా, మధ్య అమెరికా వరుసగా అత్యంత ముఖ్యమైన కందిసాగు ప్రాంతాలు. మన దేశంలో కందిగింజల బద్దలను ఉడికించి పప్పు, సాంబారు వంటి భోజ్యాలను తయారు చేస్తాం. ఇథియోపియాలో అయితే కందిపప్పుతో పాటు లేత కొమ్మలు, ఆకులు కూడా పంట పదార్థాలే! హవాయిలో పచ్చి (ఆకుపచ్చ) కందిపప్పే వాడతారు మనలా ఎండిన (పసుపు) పప్పులు కాకుండా. థాయిలాండ్‌లో అయితే కంది మొక్కను (ఇది దాదాపు చెట్టే) మరో పనికి వాడతారు - లక్క పురుగులను పెంచడానికి.

కంది గురించి...

కంది వేళ్లు భూమిలో నత్రజనిని సమకూర్చుతాయి. విశేషమేమిటంటే వర్షాభావ పరిస్థితులనూ, ప్రతికూల వాతావరణాన్ని కూడా తట్టుకుని కంది నిలబడగలదు. అటువంటిది ఈ సారి మన దేశంలోనూ, (ప్రపంచ కంది ఉత్పత్తిలో 80శాతం మనమే పండిస్తాం) నైజీరియాలోనూ కంది సాగు పడిపోయింది.

కందిలో దాదాపు 22శాతం మాంసకృతులున్నాయి. అందువల్ల శాకాహార భోజనంలో పప్పు తప్పనిసరైంది. అన్నంతో కలిపిన పప్పువల్ల శరీరానికి ఆవశ్యకమైన పోషక పదార్థాలన్నీ లభిస్తాయి.

ఒక కప్పు (దాదాపు 200గ్రా) కందిపప్పులో 700 క్యాలరీలు వున్నాయి. 3 గ్రాముల కొవ్వు, కొలెస్ట్రాల్ అసలు లేదు. ప్రొటీన్లు 44గ్రాములు, కార్బొహైడ్రేట్లు 130గ్రాములు వున్నాయి. కాల్షియం 266 మిల్లీగ్రాములు, ఇనుము 10 మిల్లీ గ్రాములు, సోడియం 34 మిల్లీగ్రాములు, పొటాషియం 2853 మిల్లీ గ్రాములు ఇంకా విటమిన్ 'ఎ' వున్నాయి.

మనం కొన్ని ఆహార పదార్థాలపై అధికంగా ఆధారపడతాం. దానివల్ల ఉపయోగం మాట అటుంచి, దాని బదులు మరొకటి వాడుకోవచ్చనే వైపే దృష్టి సారించం. కందిపప్పు మంచిదే. రుచిగానే వుంటుంది. కానీ అది ఖరీదైనప్పుడు కంగారుపడి దానికోసమే పాకులాడవలసిన పనిలేదు కదా? మరో పప్పు పెసర వంటివి వాడుకోవచ్చు. టమాటా రేటు పెరిగినా, ఉల్లి ధర అందుబాటులో లేకపోయినా తెగ హడావుడి పడిపోతాం. అవి లేకుండా వంటలు చేసుకునే వాళ్లు చాలామంది వున్నారు.

మన కంగారును బట్టే దళారీలు ధరలు మరింత పెంచుతున్నారు. ప్రత్యామ్నాయాలు మన చేతుల్లోనే ఉన్నాయి. ధరలు తగ్గినప్పుడే తింటే పోలా?

★



తెలుసా!



అగ్గిపుల్లలతో అద్భుతాలు

అతన్ని తల్లిదండ్రులు గాలిలో మేడలు కడుతున్నాడని తిట్టేవారు. అయినా మొక్కవోని దీక్షతో అతను రికార్డుల మీద రికార్డులు సృష్టించాడు. అదీ పట్టుదల అంటే. అతనే మనూ. మనూ పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 12 సార్లు నమోదయిందంట. 1993లో ఒక ప్లైవుడ్ షీట్ మీద 50,000 అగ్గిపుల్లలను అంటించి మనూ తయారుచేసిన ఏక్తా టవర్‌కు లిమ్కావారు స్పెషల్ ఇండియన్ రికార్డ్ అవార్డ్‌ను ఇచ్చారు. ఈటవర్ కోసం మనూ ఒక నెలంతా కష్టపడి నాలుగు మతాల గుర్తులను అమర్చాడు. ఒక అగ్గిపుల్లతో కుతబ్‌మినార్‌ను, సగం అగ్గిపుల్లతో 'శివాలయం' చెక్కాడు. ఏడు అగ్గిపుల్లలత్తో సిడ్నీ హార్బర్ బ్రిడ్జ్‌ను, రెండు వందల అగ్గిపుల్లలతో ఒక సీసాలో చర్చిని నిర్మించాడట. అంతేకాక మనూ 4000 పేకముక్కలతో 15 అడుగుల ఎత్తైన టవర్‌ను నిర్మించాడట. దీనిని యు.ఎస్.కి చెందిన బ్రియాన్ చే నిర్మించిన 14.5 అడుగుల టవర్‌ను ఓడించడానికని మనూ చెప్తున్నాడు. బే నిర్మించిన టవర్ 75 అంతస్తులదే కాని నేను నిర్మించిన టవర్ 78 అంతస్తులదని మనూ పెయింటింగ్స్ వేయడంలోనూ, శిల్పాలను చెక్కడంలోనూ సిద్ధహస్తుడేనట.

రూపాయి నాణెం కథ

మనదేశంలో మొట్టమొదట రూపాయి విధానాన్ని ప్రవేశపెట్టింది. షేర్షా సూరి. ఆయన 1542లో మొదటి రూపాయి నాణేన్ని విడుదల చేశాడు. ఈ నాణెం ఒక తులం బరువుండేది. అయితే ఇది 98 శాతం వెండితో తాయరయ్యేది. ఈ నాణాన్ని 'రూపియా అనేవారు. ఈ రూపియా పదం రౌష్యా అనే సంస్కృత పదం నుండి పుట్టినది. ముడి వెండి అని దీని అర్థం. ఈ రూపియా అనే పదమే క్రమేపీ నేటి రూపాయి అనే పదం వాడుకలోకి వచ్చాంది.

నిద్రపోతు 'కోలా'

ఆస్ట్రేలియాలో అధికంగా కన్పించే "కోలా"లు రోజులో 18 గంటలు నిద్రించే నిద్రపోతులు. ఇవి పగలంతా నిద్రపోయి సాయంత్రంపూట చురుకుగా సంచరిస్తాయట. ఇవి విడిగా వుండి యూకలిప్టస్ చెట్ల పై నివశిస్తాయి. కోలా' ల చేతివేళ్ళలో రెండు బొటన వేళ్ళుంటాయి. మిగతా వేళ్ళ నుండి ఇవి విడిగా వుండి యూకలిప్టస్ చెట్ల కొమ్మలపై గట్టి పట్టును పట్టి సులభంగా తిరగడానికి వీలుగా వుంటాయి. యూకలిప్టస్ లేత ఆకులు, చిగురులు వీటి ఆహారం. ఈ ఆహారపు అలవాటు వల్లనే వీటికి నీరు చాలా అరుదుగా అవసరమవుతుంటుంది. ఇవి చాలా అరుదుగా మాత్రమే నీటి కోసం చెట్ల నుండి దిగుతాయి. ఈ కారణంగానే వీటికి కోలా అని పేరు పెట్టబడిందట. ఆస్ట్రేలీయాలో కోలా' అనే పదానికి 'నీరు తాగని జంతువు అని అర్థమట.

బూటు భవనం



పెన్సిల్వేనియాలోని యార్క్ పట్టణంలో మెహ్‌లాన్ హెన్ ఒక భవనాన్ని నిర్మించాడు. అయితే దాన్ని బూటు అకారంలో నిర్మించడమే విశేషం. 1984లో నిర్మించిన ఈ భవనం బూటు ఆకారంలో వుండటం కారణంగా బూటు భవనంగా ప్రసిద్ధి చెందింది. ఈ భవనం మడమ నుండి పై కప్పు భాగం వరకు 7.5 మీటర్ల ఎత్తు, మడమనుండి బొటనవేలు భాగం వరకు 14.5 మీటర్ల పొడవు వున్నది. ఈ వింతభవనాన్ని ప్రజలు అధికంగా సందర్శిస్తుండటంతో అనతికాలంలోనే అమెరికా ప్రభుత్వ వారు ఈ బూటు భవనాన్ని చారిత్రక ప్రసిద్ధస్థలాల జాబితాలో చేర్చి...దాన్ని సొమ్ముచేసుకోవడం ప్రారంభించారు.

కథ

గతం గురుతులు

- తమ్మెర రాధిక

చీకటి దట్టంగా పర్చుకుపోయిందా పల్లెలో. ఊరంతా కీచురాళ్ళ రొద. ఏడు గంటలకే ఊరంతా ఉడుగు మగ్గి పోయింది. దొరవారి బంగ్లాలో ప్రతీ గడపముందూ లాంతర్లు వెలుగుతున్నాయి. కాంతమ్మ పక్కలో పిల్ల మెసులుతున్నది. జాకెట్ట తీసి పాలు పట్టింది. పిల్లని భుజంమీద వేసుకొని కొట్టం వెనక్కు వచ్చింది. చీకట్లో అలవాటైన దారే! ఎడ్లు కంచెలోకి పొయ్యే సన్నని కాలిబాటది. కొట్టం మొండి గోడల దగ్గర్నించి చూస్తే కంచెకు దారి కన్పిస్తది. మొండి గోడల మీంచి ఎవరివో చేతులు ఆ పిల్లనందుకోంగనే గిరుక్కున చీకట్లో ఇంట్లో కొచ్చింది.

"కాంతమ్మా పొద్దు పోయిందంక ఏం చేస్తున్నవే ఇంట్ల లెవ్వు.. " దొర్సాని మనిషి వీరమ్మ లోపటకొచ్చి తలుపు తెరిచింది. అక్కడి దృశ్యం చూసి అరుచుకుంట బైటకురుకొచ్చింది. "కాంతమ్మ సచ్చిందో ఏందో రాంద్రుల్లో" అంటు.

మరునిముషంలో జీతగాళ్ళు, వేట్టోళ్ళు, దొర్సాని కొడుకులు, కోడళ్ళు, పిల్లా జెల్లా అంతా అక్కడ పోగైంద్రు. కాంతమ్మ పండుకున్న చద్దరంత, నేలంత, రక్తంతోని తడిసింది. చెయ్యి కోసినట్టున్నది. రక్తం ఆగుతలేదు. ఆమె తెలివిల లేదు.

"అయ్యో.... పక్కల పోరేదీ?" దొర్సాని అనే వరకు అందరు ఉలిక్కిపడ్డరు. అంతదంక ఎవ్వలకా ధ్యాస పోలేదు.

కాంతమ్మ మొకాన నీల్లు జల్లి లేపి కూకుండ బెట్టింద్రు. అక్కడ అంతమందిని చూడంగనె గొల్లు మన్నది. "ఏవైందే గా చెయ్యెంతట్ల కోసుకున్నవు?" కండ్లు పెద్దంగ చేసి చూసి గదుమాయించింది దొర్సాని. ఆమె కాళ్ళ మీద పడ్డది కాంతమ్మ. నడిరాత్రెవరో తన బిడ్డని పక్కల నుంచెల్లి గుంజకపోయింద్రనీ, తిర్గబడితే చెయ్యంత కోసింద్రనీ చెప్పి ఏడ్చింది. దాని ఏడ్పుకు అందరు కదిలిపోయినా నోరెత్తి ఓదార్చే ధైర్యం చెయ్యలేదెవరు. ఎవరి పన్లకు వాళ్ళను ఎల్లిపొమ్మన్నది సరలమ్మ దొర్సాని. కొట్టంగదిల ఇద్దరే మిగిలింద్రు.

"బిడ్డనేంజేసినవ్?" ఎటువంటి ఉపోద్ఘాతం లేకుంటనే కర్కశంగ అడిగిందామె. "ఎవలో అర్ధరాత్రి..." చెంప చెళ్ళుమన్నది కాంతమ్మకు.

"కథలు చెప్తాన్నవా కథలు. తోలుతీస్త బిడ్డా" వేలు ఎత్తి చూపించుకుంట అన్నది.

"దాని జాడ చెప్పకపోతివా, రేపు మార్వాడీ సేటొస్తున్నడు. నీ పెద్దబిడ్డని వాంతోని పంపుత ఆఁ...."

"నాకు తెల్వదు దొర్సానీ ..." మెల్లెంగ తలెత్తి చూసింది కాంతమ్మ. "ఎవలకిచ్చినవే?"

"ఎవలో ఎత్క..."

"ఎట్టి బందు పెట్టమని సంఘపోల్లు సాటింపు ఏయిస్తున్నరన్న ధైర్యమా లంజ... దాన్ని బైటికి పంపి సంసార్ని చేద్దమనుకుంటున్నవా? మూలనున్న కర్ర ఒంటి మీద నాట్యమాడుతున్నా, దాని వెర్రికేకలు పెరడంత మోగుతున్నా, అందరూ తలొంచుకొని పన్లు చేసుకుంటున్నరు. కాంతమ్మ కూతరు చిట్టి బావిదగ్గర భోళ్ళు తోముతున్నది తల్లి ఏడ్పు ఇనుకుంట. ఆ దెబ్బల చప్పుడుకు ఎక్కెక్కి పడుతున్నది. కడుపుల ఆకలి తల్లిని కొడుతున్న దెబ్బలకు సచ్చిపోయింది. గంపల తోమిన బాసన్లు పెట్టుకొని వటింటి ముంగలకొచ్చి వంటామెకు అందించింది.

❀ ❀ ❀

చదువుతున్న పుస్తకం మూసి, ప్లాస్కులో వున్న టీ కప్పులోకి వంచుకొని, కిటికీలోంచి బైటకి చూస్తూ తాగుతోంది సరిత. చాలా రోజుల్నించి ఫాదర్ తనతో అంటున్నారు 'ఏదో ఒకనాడు రజాకార్ల ఆగడాల గురించి ఒక కథ వస్తుంది. నువ్వు తప్పక చదవాలా కథ' అని. ఈ వారం పత్రికలో అచ్చయిందీ కథ. స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాదుని ప్రభుత్వంలో విలీనం చెయ్య నిరాకరించిన నైజాం, రజాకార్లను తయారు చేసి కాసిం, రజ్వి నాయకత్వంలో సైన్యాన్ని ఊళ్ళమీదికి ఉసిగొల్పుతున్నాడు. వాస్తవానికి నైజాం మంచి వాడే. రజ్వానే కర్కోటకుడంటారు. భూస్వామ్య వ్యవస్థలో వెట్టి వల్ల ఎంత మంది దుర్భర జీవితాలు గడిపారో ఫాదర్ అప్పుడప్పుడు చెప్తుండేవారు.

❀ ❀ ❀

మధ్యాహ్నం కాంతమ్మ పాకల్నించి బైటకెల్లింది. దెబ్బలతోని అరచెయ్య వాచిపోయింది. కర్రతోని కొట్టేవర్కు చీరికల్నించి గంజి గంజి రసమొస్తాంది. నెత్తి అట్టుకు గుంజె వరకు పొర్క పొకైంది జుట్టు. వంటామె ఇస్తరి ఏసి అన్నం, గింతంత మామిడి కాయ తొక్కు ఏసి కాంతమ్మను సైగగా పిల్చింది వచ్చి తినుమని.

"నా బిడ్డ తిన్నాదమ్మ!" చుట్టు చూసింది కాంతమ్మ. గొడ్ల సావిట్ల కుడితి గోలెం పక్కన బస్త మీద పండుకొనున్నది చిట్టి. అటేపు పొయ్యి 'బిడ్డా!!" అనుకుంట ఒంట మీద చెయ్యేసేవరకు ఉలిక్కిపడ్డది చిట్టి. తల్లిని చూడంగనే గుడ్ల నీల్లు కారుతుంటె వొల్లె తలకాయ పెట్టి మౌనంగ ఏడ్చింది. ఏడ్పు దొర్సానింటే ఈపు పగుల్తదని దానికి తెల్సు. ఇస్తరి కాడికి పట్టుకొని పోయింది. తల్లి చెయ్యి చూసి చిట్టే అన్నం కల్పింది. పెల్ల చిదుపుతె మెతుకులు చెమ్మగిల్లుతున్నది. తొక్కు కల్పి తల్లి నోట్లో పెట్టింది. కాంతమ్మ పెదిమ పగిలి వుందేమో కారం తగలంగనే భగ్గుమన్నది. "సస్తిని బిడ్డో" కళ్లంబడి కారే నీళ్లను తుడవబోయింది తల్లి తుడుసుకోలేక అవస్థ బడుతుంటే.

"గత్తు వాసనేంది బిడ్డా ! పెద్దొర్సాని అవులగ్గిన పోయినావా?" అడిగింది. కాంతమ్మ.

"ఆఁ ఉచ్చపట్ట లేదని తిట్టుకుంట లోటల వున్న నీల్లు నా మొకాన కొట్టింది" పిల్ల మాటలకు నొచ్చుకుంట ఒక్క చేత్తో గుడ్డలిప్పింది. తను రేత్తిరి మూత్రం పట్టి పక్కన పెట్టింది. లోటాల తెల్లారి పారబొద్దామని హు! దయగల తల్లులు.

దొర పెద్దబిడ్డ పెండ్లి పెట్టుకున్నరు. వెట్టి మాదుగులు గడిలో వడ్లు దంచుతున్నరు. కొందరు జల్లెడ పడుతున్నరు. నూకలు కుప్పోలిగె పోస్తున్నరు. వడ్లు దంపుకుంట ఎవలకెన్ని నూకలొత్తయ్యో లెక్కేసుకుంటున్నరు. సుట్టాలు శానమంది వున్నరింట్ల. జీతగాళ్ళు ఒళ్ళు పులిసి ఆగమతున్రు పన్లు చేయ్యలేక.

గడీల గడ్‌బడ్ మొదలైంది. సంఘపోల్లు ఒకరిద్దరు వచ్చి ఊల్లె ఏన్నో దాక్కున్నరని పుకారైంది. దొర సుట్టం రాఘవరావు పట్వాలి దొర గడీ కొచ్చిండోసారి పెండ్లికి ముందు. ఆయనెంబడో వెట్టోడు దస్త్రాలు పట్టుకొని వచ్చి గడీల దస్త్రాల్ని దాసింద్రు. ఎడాదికింతని వందో రెండొందలో పన్నులు

వ్యవసాయం భూములకు కట్టలేని రైతుల్నించి అదిరించి బెదిరించి వాళ్ల భూములు రాయించుకున్న కాయితాలు పట్వారీడికొచ్చి దాయబెట్టిండు. వాళ్లవుళ్ల చీకటి రాజ్యపోల్లు పేదోల్లకు సంబంధించిన దస్త్రాలు పట్వారీల దగ్గరున్నయి. కనుక వాటని వాళ్ల దగ్గర్నించి లాక్కొని కాల బెట్టాలని చాటింపు ఏయించిండ్రు. ఆ చాటింపు వేసినోన్ని పోలీసులు సంపిండ్రని, సంఘపోల్లు ఆగ్రహంగున్నరని తెలుకున్న రాఘవరావు దొర తన కుటుంబాన్ని పెండ్లి పేరుతో ఇక్కడికి పంపి, వెనక తను వచ్చిండు దస్త్రాలు పట్టుకొని. గడీల అత్యంత నమ్మకమైనట్లే తిరుగుతున్నరు. దొరలు జీతాల్ల ముందట నోరు మెదపుతలేరు. ఏం మాట్లాడుకోవాల్నన్న అర్రల్ల రహస్యంగ మంతనాలు చేస్తున్నరు. ఈసారి దసరా చూడాల్నని దొరతోని యాపారం చేసే మార్వాడి సేటు వచ్చివున్నడు. నడి వూల్లె దసర చేసెటందుకు దడి కడ్తున్నారు. ఆ రోజు దొరబిడ్డ పెండ్లి పెట్టుకున్నరు. పండగ నాడు ఏం మూర్తమని ఆడోల్లు గులిగినా, మగోల్లు ఖాతరు చెయ్యలే.

దసర కోసం పట్వారీ సానపెట్టించిన కత్తీ నూనెతోని తుడిపించిన తుపాకీ మెరుపులు మెరుసుకుంట ఊరిస్తున్నయి వాడ్ని. సాయంత్రం దస్రకాడ యాటని నర్కెటందుకు పట్వారి తల్వారినీ సాన పెట్టించిండు. గడీలో వున్నొల్లకిది ఆనవాయితే. తుపాకి పేల్చి, కత్తితోని యాటని నర్కి బొట్టు పెట్టుకొని వస్తె దస్రం అయినట్టు లెక్క. అటెంక చిల్లర జాతొల్లు గా రక్తం బొట్టు కోసం కింద మీద బడుకుంట కొట్లాడ్తరు. పాత పగలున్నాలకు గిదే సందు తన్నుకునెటందుకు.

"లావ్ జావ్" వెండి పల్లెంల పెట్టిన మాంసం ముక్క వాని మీదకి ఇసిరేసిండు. ఆ ముక్క నోటిక్కర్సుకొని గడిదాటిండు వాడు.

❀ ❀ ❀

ఫోన్ మోగింది. చదువుతున్న పుస్తకం మూసి వెళ్ళి ఫోనెత్తింది సరిత. "హస్పటల్లో ఆపరేషన్ కేసుంది... నువ్వు అన్నం తినెయ్యి సరితా!... ఆయా వుంది కదా ఇంట్లో?" భర్త ఆనంద్ మాటలకు వుందన్నది ఆమె. సరితకు ఏ రాత్రయినా డెలివరీ కావచ్చని ఇంట్లో ఆయాని వుంచాడు. ఈ వారం రోజుల్లో ముఖ్యమైన ఆపరేషన్లు పూర్తి చేసుకుంటే ఇక భార్యని చూసుకోవచ్చని ఆనంద్ ఆలోచన.

ఆ రోజెందుకో ఆమెకు భారంగానే వుంది. పొట్ట పూర్తిగా జారిపోయింది. ఆయా వేడినీళ్ళు పెడితే జాగ్రత్తగా స్నానం చేసి వచ్చి పడుకుంది. అరగంటలో నొప్పులు మొదలయ్యాయి. ఆయమ్మ వెంటనే కారు సిద్ధం చేయించి హాస్పటల్‌కు తీసుకొచ్చింది. ఆమె భర్త ఆపరేషన్ రూంలో వున్నాడు ఎవరికో సర్జరీ చేస్తూ. లేడీ డాక్టర్ లేబర్ రూంకు తీసుకుపోయింది సరితను. కొద్దిసేపటికి విచారంగా బైటకొచ్చాడు ఆనంద్ ఆపరేషన్ థియేటర్ నించి. తను తీసుకున్న కేసులో పేషంట్ వీరయ్య చనిపోయాడు నాలుగింటికి.

"కంగ్రాట్స్ డాక్టర్! మీకు మగబిడ్డ పుట్టాడు. నాలుగు గంటలా ఒక సెకన్‌కి" నర్స్ గబగబా వచ్చి చెప్పింది అతన్తో. పసి పిల్లవాడు ఆనంద్ పోలికలతో తెల్లగా అందంగా ఉన్నాడు. సరితతో మాట్లాడుతుండంగానే చర్చి నించి ఫాదర్ వచ్చారు. వస్తూనే పిల్లాడ్ని చూసి – "వీరయ్య ఏమంటున్నాడు డాక్టర్?" అడిగాడు ఆయన.

ఫాదర్ మాటలకు "నా శాయశక్తులా ప్రయత్నించాను సార్. ఇందాకే పోయాడు నాలుగు గంటలకు" అన్నాడు ఆనంద్.

"వీడూ అదే టయానికి పుట్టాడండీ" నవ్వింది సరిత. ఆ మాటలకు ఫాదర్ కళ్ళు విచిత్రంగా మెరిశాయి. శవాన్ని మార్చురీలో వుంచుమన్నారు. తలూపాడు ఆనంద్.

❀ ❀ ❀

ఊరంతా దసరా సంబరం పెద్దగ లేదు. దొర ఇంట్ల పెండ్లయి విందు ముగిసింది. ఆడోల్లు మిగతా లగ్గం పన్లో మునిగి వున్నరు. మొగోల్లు దసరకు రెడీ అయి కూసున్నరో లేదో పట్వారీ తుపాకీ, తల్వారీ అగపడ్తలెవ్వని గడీల గగ్గోలు పుట్టింది. దొర మనసుల ఆందోళన దాసుకుంట సుట్టాల ముందట గంభీరంగ వుండే ప్రయత్నం చేసుకుంట కార్యక్రమం కానీయమన్నడు. గడీ ముందల తడికెలతోని దడి కట్టిండ్రు. దొర కండ్లు ఎవరి కోసమో వెతుకుతున్నయి. అంత మందిల వీరడు మార్వాడి సేటుతోని చేతులు తిప్పుకుంట ఏందేందో చెప్తుతున్నడు. పండగెల్లె చేస్తరని సేటు అడుగుతున్నట్టున్నది. ఏటపోతు తల ఎగిరిపడిందో లేదో గడీల ఒక్కసారిగ కేకలు... బొబ్బలు.. ఏడ్పులు... తుపాకి మోతలతోని నిముషంల ప్రశాంతత చెడింది.

తుపాకి శబ్దం ఇనుడుతోనే లోపలికి జనం రాకుంట గడీ తులుపులు ఏసేసిండ్రు. దట్టమయిన పొగల ఎవరికెమయ్యిందో తెలుస్తలేదు. పెట్రోమాక్స్ దీపాలు ఎలిగిరిచి చూసేవరకు రక్తం మడుగుల దొర్సాని పడివుంది. కాంతమ్మక్కూడ ఊపిరి పోయినట్టే వుంది. పెండ్లి కూతురు, మిగతా సుట్టాలు అర్రల దాక్కొని తులుపులు ఏసుకున్నరు. బంగారం వస్తువులు, నోట్ల కట్టలు చిందర వందరగా పడి వున్నయి. వీరయ్య జాడలేదు. గడీల దొడ్డెన్క తలుపులు బార్ల తీసివుండె.

❀ ❀ ❀

కథ పూర్తిగ చదివిన సరిత ఫాదర్ వైపు చూసింది.

"సరితా నువ్వొక్కసారి నాతో మార్చురీ దాకా రా" అన్నాడు. ఆయన మాటలకు అయోమయంగా చూసింది.

"అవునమ్మా.. బాబుని ఆయాకిచ్చిరా"

ఇద్దరూ మార్చురీ దగ్గరికి వచ్చారు. ఎవరిదో శవం శ్మశానాకి వెళ్ళిపోవడానికి రెడీగా వుంది. ఫాదర్ దాని మీద గుడ్డ తీసేసాడు. సరిత తదేకంగా చూసింది. యాథాప్రకారం గుడ్డ కప్పి వాళ్ళను సైగ చేసాడు తీసుకుపొమ్మట్టు.

"నన్నెందుకు చూడమన్నారు?" అడిగింది సరిత.

"అతను మీ తాత కనుక".

"తాతా" ఆశ్చర్యపోయింది.

"అవునమ్మా మీ తాతే! తెలంగాణాలో రజాకార్ల దురాగతాలకు, ఆగమైపోతున్న జనాలకు సంఘం అండగ నిలబడిన రోజులల్లో కాంతమ్మ గడీలో అంగడి బొమ్మ. ఎవరి అవసరానికైనా ఆమెని వాడుకునే వారు. అలా పుట్టిందే చిట్టి. తరువాత ఏడేళ్ళకు వీరయ్యకు కాంతమ్మనిచ్చి పెండ్లి చేసారు. చిట్టి గడప దాటి పోయే పనిలేదు. తల్లిలానే ఎవరి అవసరాలకో ఆమె బలి కావల్సిందే! తరువాత పుట్టిన చంటిదానిమీద దొర్సాని కన్ను పడటం కావల్సిందే! తరువాత పుట్టిన చంటిదానిమీద దొర్సాని కన్ను పడటం కాంతమ్మనీ వీరయ్యనీ ఆందోళనలో పడేసింది. అప్పట్లో మత మార్పిడి పనుల మీద చర్చి తరుపున మేము పల్లెటూళ్ళల్లోకి వస్తూ పోతు వుండే వాళ్ళము. నాకప్పుడు ఇరవయ్యేళ్ళు. వీరయ్య తన గోడు వెళబోసుకున్నప్పుడు ఆ చంటిపిల్లని దొంగ చాటుగా మేం చర్చికి తీసుకెళ్ళాం. ఇక్కడ అందర్తో పాటు పెరిగి పెళ్లి చేసుకుని ఒక పిల్లని కని చనిపోయింది. ఆ పిల్లవు నువ్వే.

"నేనా!" నిర్ఘాంతపోయింది సరిత.

"అవును. నువ్వు పుట్టాక నీ తండ్రి నెలల తేడాతో చనిపోయాడు. నువ్వు చదువులో చురుకుగా వుండటంతో నా సంరక్షణలో బాగా చదివించి, ఆదర్శ భావాలు గల ఆనంద్ కోరిక మీద నిన్ను అతనికిచ్చి పెళ్ళి చేసాను. కానీ ఎప్పుడు కూడా వీరయ్య నీ తాతని నీకు చెప్పలేదు. వీరయ్య వేరే చర్చిలో పని చేసినా, నిన్ను చూడటానికి దొంగ చాటుగా ఇక్కడికి వచ్చే వాడు, దూరం నించి చూసి వెళ్ళిపోయేవాడు. ఆనంద్‌తో నేనెప్పుడూ చెప్పలేదీ విషయం. తెలియకుండా వుంటేనే మంచిదని నా మనస్సుకు తోచడం వల్ల అలా చేశాను" అన్నాడు ఫాదర్.

"చెప్తే ఏం ఫాదర్?" అనాలోచితంగా అంది సరిత.

"నువ్వు అనాథవనే ఆనంద్‌కి చెప్పాను. ఆడబాపల వ్యవస్థ నుంచొచ్చిన ఆడపిల్లవని తెలిస్తే అతని ఆదర్శమేమో గానీ, కుటుంబంలో నీపై ఆదరణ తగ్గి అవస్థలు పడతావనే చెప్పలేదు. మీ తాతకు తెల్సు నువ్వు తన మనవరాలివని. అందుకే అతను పోయిన సెకనుకే వీడు పుట్టాడు" రూంకి వచ్చిన ఫాదర్ పసివాడి బుగ్గలు నిమురుతూ అంటుంటే కళ్ళు తుడుచుకుంది సరిత కథ లాంటి తన జీవితాన్ని తల్చుకుంటూ.

★

కొత్త పుస్తకాలు

శ్రీశ్రీసాహిత్యం- సమకాలీనత

పునర్మూల్యాంకనం పేర ఒక తరం కవులు, రచయితల గురించి, వారి సాహిత్యం సమకాలీనత గురించి విశ్లేషించడం సహేతుకమైన పనే. కానీ కొందరు పనిగట్టుకుని ఆనాడు ఆ కవులకు లేని కులస్పృహ వంటి పాక్షికతలను అంటగట్టి చూడడం, ఆనాటి సామాజిక చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకోకుండా వారు ఫలానాదాని గురించి రాయలేదు కనుక, ఫలానా విషయానికి, ఫలానా వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వలేదు గనుక ఇవాళ వారూ, వారి సాహిత్యం కూడా విస్మరించదగినవేనన్నట్లుగా పలుకుతుండడం, రాతలు రాస్తుండడం శోచనీయం. శతజయంతి సందర్భంగా శ్రీశ్రీ గురించి ఇవాళ కొందరు రాస్తున్న రాతల్లో ఆయన సాహిత్యమూ, దాని ప్రభావమూ, నేటికీ శ్రీశ్రీ కవిత్వం యొక్క 'కాలిక'తను కాక ఆయన వ్యక్తిత్వంలోని దోషాలనూ, ఆయన వ్యసనాలనూ ప్రధానం చేస్తూ, ఆయన తన కవిత్వంలో నాడు స్పృశించని అంశాల గురించి ఈనాడు ఎద్దేవా చేస్తూ శ్రీశ్రీని తక్కువచేసి చూపబోవడం చూస్తుంటేనే ఒక సంస్కారహీనత నేడు ఎలా సాహిత్యలోకంలోనూ విస్తరిస్తోందో గ్రహింపునకు వచ్చి బాధవేస్తుంది.

తెలకపల్లి రవి రాసిన 'శ్రీశ్రీ సాహిత్యం- సమకాలీనత' గ్రంథంలోని పది వ్యాసాలూ ఒక వాస్తవిక దృక్కోణంలో శ్రీశ్రీని ఎలా చూడాలి, అర్థం చేసుకోవాలి అన్నదానికి దాఖలాలుగా, ఉపయుక్తాలుగా వున్నాయి. మునుపు రాసిన వ్యాసాలకు శతజయంతి సందర్భంగా మరి రెండు వ్యాసాలను జోడించి ఈ గ్రంథాన్ని వెలువరించారు. ముఖ్యంగా 'వైరుధ్యాలున్నా అమూల్యమే' వ్యాసం ఎత్తుగడలోనే "శ్రీశ్రీ ప్రభావాన్ని' పునరుద్ధరించటం' సాధ్యం కాదని కొందరంటుంటారు. ఆయన ప్రభావం లేకుండా పోతేకదా! ఎవరైనా పునరుద్ధరించడమనే ప్రశ్న.. పునాదులు కన్పించవు కనుక భవనంపై వాటి ప్రభావం లేదనటం ఎలాంటిదో శ్రీశ్రీ వంటి వారి ప్రభావాన్ని చూడనిరాకరించడమూ అంతే" అంటారు.



శ్రీశ్రీసాహిత్యం- సమకాలీనత
తెలకపల్లి రవి
వెల : 20 రూ/-
పేజీలు :
సాహితీ స్రవంతి ప్రచురణ,
21/17 ఎం.హెచ్.భవన్,
ఆర్.టి.సి కళ్యాణమండపం దగ్గర,
అజామాబాద్
హైదరాబాద్-20.

ఇవి శ్రీశ్రీ పట్ల వీరాభిమానంతో రాసిన వ్యాసాలుగానీ, అలాగని ఒక పాక్షిక దృష్టితో చూసి చేసిన రచనలుగానీ కావు. విరసం శ్రీశ్రీని తమవాడే అని మోయడం గురించి కూడా రవి విభేదిస్తారు. శ్రీశ్రీ కవిత్వంలో దళితులు వెనకబడిన తరగతుల ప్రస్తావన లేదనే విమర్శలు వస్తూంటాయి. ఆ ప్రస్తావనలు లేని మాట నిజమని అంగీకరిస్తూనే ఆ కవిత్వం పీడితులందరి పక్షం వహించిందనే సత్యాన్ని చెప్పుకోవాల్సి ఉంటుందన్న అవగాహన సరియైనది. "ఓవర్ ఆల్ పిక్చర్ నేనిచ్చాను. నేను ప్రత్యేకంగా స్త్రీల సమస్య అని తీసుకుని ఓ పోయమ్ రాయనంత మాత్రం చేత నేను ఆ పక్షాన లేను అని అనను. ఎందుచేతంటే నేను జరుగుతున్న అన్నిరకాల ఎక్స్ప్లాయిటేషన్ను చూపించాను. ఇది ఒక పర్టిక్యులర్ కోణం" అని ఈ సమీక్షకుడితో శ్రీశ్రీ రేడియో ఇంటర్వ్యూ (26.3.1982) లోనూ స్వయంగా విశదపరిచారు. 'సర్వేజనా సుఖినోభవంతు' అంటే సర్వే డిపార్ట్మెంట్ వాళ్ళేనా మరి రెవిన్యూ డిపార్ట్మెంట్వాళ్ల మాటేమిటి అని అడిగినట్లుంటుందని కూడా ఇలాంటి విమర్శకుల గురించి చమత్కరించారు. "శ్రీశ్రీ విశ్వరూపమనదగిన 'అనంతం' అనేక పాఠాలు, గుణపాఠాలు అందిస్తుంది. కవులు, రచయితలకు ఎన్నో విషయాలు నేర్పిస్తుంది. అంతటి వ్యక్తే తప్పటడుగులు వేయడాన్ని బట్టి ఈ సమాజం ఎంత ప్రమాదకరమైందో, దానితో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో అర్థమవుతుంది.' అంటారు రవి.

'చెరగని స్ఫూర్తికి ప్రతీకలో' రవి వివరించినట్లుగా "ఇప్పుడు ఆధునికానంతర వాదులు కొందరు గురజాడ, శ్రీశ్రీలపై దాడి చేయడం ఒక కార్యక్రమంగా పెట్టుకున్నారు. ఎంతటి మహాకవులు, రచయితలకైనా చారిత్రకంగానూ, వ్యక్తిగతంగానూ ఏవో పరిమితులు వుంటాయి. గొప్ప రచనలకు కొంతవరకు సార్వజనీన, సార్వకాలిక లక్షణాలు వుంటాయి. గాని శాశ్వతంగా అవే శిరోధార్యమని ఎవరూ చెప్పరు. మనకన్నా ముందు తరాలవారి కృషిలో ఉన్నతాంశాలను గుర్తించి కాలానుగుణంగా ముందుకు తీసుకుపోవడమెలా అని ఆలోచించాలి గాని వారి పరిమితులు మాత్రమే చూస్తూ ఆ వారసత్వంలోని ప్రయోజనాత్మక అంశాలను చూడలేకపోవడం వాస్తవికదృష్టి అన్పించుకోదు". ఈ శతాబ్దిలోని అక్షరాభిమానులకు, వాస్తవిక దృష్టితో అర్థంచేసుకోవడానికి ఉపకరించే గ్రంథం ఇది. కొన్ని పునరుక్తులు, చర్విత చరణాలు వున్నా అది ఒక సదభిప్రాయాన్ని బలోపేతం చేయడానికేనని గ్రహించాలి.

- సుధామ

పొ...డ...వా...టి పెళ్లిగౌను

ధవళవస్త్రాల్లో తళతళా మెరిసిపోతున్న పెళ్లికూతుర్ని చూస్తుంటే ముచ్చటగా వుందికదూ. ఆమె వేసుకున్న గౌను ప్రత్యేకత చెప్తే ఔరా అనేస్తారు టక్కున. ఆ గౌను సింపుల్‌గా 1.4 మీటర్ల పొడవుంది. దీన్ని కుట్టడానికే మూడు మాసాలు పట్టిందంటే నమ్మండి. ఇంతకీ ఇందుకోసం ఎంత ఖర్చయిందో తెల్సా? 40,000 యువాన్లు. ఈ గౌనుకి 9, 999 గులాబీలను అమర్చారు. మరి ఆమాత్రం ఖర్చవదా ఏంటి? అద్సరే ఇంత ఖరీదు పెట్టి పెళ్లికూతురి గౌను తీసుకొచ్చిన పెళ్లి కొడుకు ఎవరబ్బా? అనుకుంటున్నారా! చైనాలో వున్నాడులెండి! అతనే స్వయంగా దీన్ని కుట్టేడు. అదేలెండి బంధుమిత్రుల సహకారంతో. ఇంత కష్టపడితే అతని తల్లి ఏమందంటే... "పెళ్లి గౌను కోసం ఎందుకంత డబ్బు వృధా చేయడం" అని. ఇంతలోనే "ఇలా కాబోయే భార్య మీదున్న తన ప్రేమను ప్రదర్శించాలనుకుంటున్నాడు మరి" అంటుంది చిరుమందహాసం కురిపిస్తూ.

అసలు విశేషం ఏంటంటే...ఇంత పెద్ద పెళ్లి గౌను ను ఇంత వరకు ప్రపంచంలో ఎవరూ కుట్టలేదు. ఇదే ప్రపంచ రికార్డు. అందుకే తన పెళ్లి దృశ్యాన్ని చిత్రీకరించిన వీడియోను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ వారికి పంపాడతగాడు. ఐడియా బానేవున్నట్టుందా!

అలీబాబా 40 దొంగలు

జరిగినకథ:

దొంగల ముఠా గుహను అలీబాబా చూస్తాడు. లోపలికెళ్లి నగలు, డబ్బు గోతాల్లో తెచ్చుకుంటాడు. ఈ విషయం తెలుసుకున్న అతని అన్న కూడా గుహకు వెళ్లి దొంగల చేతిలో హతుడవుతాడు. అయితే అలీబాబా తర్వాత ఎలాగో అతని శవాన్ని తీసుకొచ్చి దహనసంస్కారాలు చేయిస్తాడు. కానీ దొంగల ముఠా నాయకుడు మాత్రం ఎంతగానో శ్రమించి తమ సొత్తు దోచుకున్న అలీబాబా గురించి తెలుసుకుంటాడు. అతడిని అంతం చేయడానికి తోలు సంచుల్లో దొంగలను కూర్చోబెట్టి తీసుకెళతాడు. ఈ విషయాన్ని అలీబాబా భార్య తెలుసుకుంటుంది. ఆ తర్వాత....

వారు తమ కుటుంబాన్ని నాశనం చేయడానికే వచ్చారని గ్రహిస్తుంది. అయితే విషయం మొత్తం తెల్సుకోవాలనుకుంటుంది. వెంటనే పరదా పక్కన దాక్కుని అంతా పరిశీలిస్తుంటుంది. కాసేపటి తర్వాత వ్యాపారి ఆ గోతాల దగ్గరకొచ్చి చేత్తో తట్టి "సిద్ధంగా వుండండి" అని చెప్పడం చూస్తుంది. దాంతో వాళ్లది దొంగల ముఠానేనన్న విషయం రూఢి చేసుకుంటుంది. ఆ తర్వాత ఒక్క క్షణం కూడా ఆగలేకపోతుంది. భర్తను సంప్రదించి అంతా చెప్తుంది. అతను బాగా ఆలోచించి

"నీకు గొంతు అనుకరించడం వచ్చుకదా...." అంటూ ఆమె చెవిలో రహస్యంగా ఏదో చెప్తాడు.

ఇద్దరూ కలిసి ద్రాక్ష సారా తీసుకొచ్చి విషం కలుపుతారు. చిన్న చిన్న పాత్రల్లో పోస్తారు. ఒక్కో గోతాం దగ్గరకు వెళ్లి చేత్తో తాకి

"అందాకా ఈ ద్రాక్ష సారా తాగి విశ్రాంతి తీసుకోండి. సమయం వచ్చినప్పుడు పిలుస్తాను" అంటూ సారా బుడ్డి అందిస్తారు. అదీ దొంగల నాయకుడి గొంతులో మాట్లాడేసరికి వారికి ఏమాత్రం అనుమానం లేకుండా పని సులభంగా జరిగిపోతుంది. విషం కలిపిన సారా తాగడంతో వారి ప్రాణాలు గోతాల్లోనే అనంతవాయువుల్లో కలిసిపోతాయి.

దొంగల నాయకుడు అర్థరాత్రివేళ వచ్చి ఎన్నిసార్లు పిల్చినా...అరిచినా ఒక్కరూ కదలరు. మెదలరు. మరి వారంతా చచ్చారుకదా. అన్ని సంచుల్లోనూ ఇదే పరిస్థితి. నాయకుడు ఇదంతా చూచి భరించలేకపోతాడు. అక్కడ ఒక్క క్షణం కూడా వుండలేక స్థావరానికి వెళ్లి భోరున విలపిస్తాడు. తన అపార ధనాన్ని కాజేసి, అనుచరులను అంతం చేసిన అలీబాబా మీద పగ తీర్చుకోవాలనుకుంటాడు. అతడిని చంపేయాలనుకుంటాడు.

అయితే అలీబాబా కూడా దొంగలనాయకుడిని ఏమీ చేయలేకపోయినందుకు విచారిస్తుంటాడు. దానికి భార్య సర్దిచెప్తుంది. వాడు ఒక్కడే ఏమీ చేయలేడని ధైర్యం చెప్తుంది.

దొంగల నాయకుడు చాలా రోజుల పాటు వేచి వుంటాడు. పక్కా ప్రణాళిక వేసుకుంటాడు. విలువైన రత్నాలు, ఆభరణాలు తీసుకుని వ్యాపారి వేషం వేసుకుని బయలుదేరతాడు. ఎకాఎకిన అలీబాబా ఇంటికి వెళ్లి తనొక వ్యాపారినంటూ పరిచయం చేసుకుని ఆభరణాలన్నీ చూపిస్తాడు. వాటిని చూచిన అలీబాబా భార్య ఆనందపడుతుంది. వాటిని కొనుక్కుంటాననంటుంది. అయితే భర్త వచ్చే వరకు ఆగమంటుంది. ఆమె తనను గుర్తించనందుకు దొంగల నాయకుడు ఎంతగానో సంతోషిస్తాడు. పైగా మరుసటి రోజు వస్తానని చెప్పి వెళ్తాడు.

మరుసటిరోజు వెళ్లినప్పుడు ఇంట్లో అలీబాబా కూడా వుంటాడు. సలాం చేసి బీగంకు నచ్చిన నగలన్నీ పరిచి చూయిస్తాడు.

తర్వాత అలీబాబా వైపు కృతజ్ఞతతో చూస్తూ..."సాబ్ మీకు ఈ నగరంలో ఎంతో పేరుంది. మీరు చెప్తే నా నగలు, ఆభరణాలన్నీ చిటికెలో అమ్ముడవుతాయి. కాస్త ఆ సాయం చేయరూ..." అంటాడు.

అతని వినయం చూసి ఎంతో మంచివాడనుకున్న అలీబాబా తనకు తెల్సిన వారి పేర్లు చెప్తాడు. దొంగలనాయకుడు వారి ఇళ్లకు వెళ్లి చక్కగా వాటిని అమ్ముకుంటాడు. తర్వాత మళ్లీ అలీబాబా ఇంటికి వచ్చి... అతని చేతులు పట్టుకుని

"మీరు చెప్పిన వారంతా నా దగ్గర ఎన్నో ఆభరణాలు కొనుగోలు చేశారు. మీకిదే నా చిరుకానుక" అంటూ ఓ వజ్రాల హారాన్ని అందిస్తాడు.

దాన్ని అలీబాబా సున్నితంగా తిరస్కరించడంతో...

"మీ స్నేహితుడే ఇస్తే తీసుకోరా" అంటూ మొహమాట పెడతాడు. దాంతో అతను తీసుకుంటాడు.

ఆ తర్వాత పక్షం రోజులకు దొంగల నాయకుడు మళ్లీ అలీబాబా ఇంటికి వచ్చి...

"నేను తెచ్చిన ఆభరణాలన్నీ అమ్మేశాను. బాగా లాభం వచ్చింది. సంతోషంగా తిరిగి మా దేశం వెళ్లిపోతున్నాను. ఈ సందర్భంగా మీకు ఒక విందు ఇస్తాను. మీరు కుటుంబ సమేతంగా రావాలి" అంటూ పట్టుపడతాడు. తప్పనిసరి పరిస్థితుల్లో అలీబాబా అంగీకరిస్తాడు. భార్య, పరివారంతో సహా విందుకు వెళతాడు అలీబాబా.

(అక్కడ ఏమౌతుంది? దొంగల నాయకుడు అలీబాబాని చంపేస్తాడా? అలీబాబా దొంగల నాయకుడిని హతమరుస్తాడా? తెలియాలంటే...వారం రోజులు ఆగాల్సిందే)

పునఃకథనం: కె. చరిత